
అభ్యుదయ

జనవరి 1979 ఒక రూపాయి

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం
8 వ మహాసభ ప్రత్యేక సంచిక



ప్రథమ మహాసభాధ్యక్షుడు శ్రీ తాపీ ధర్మారావు

స్వయం ఉపాధికి సోపానాలు

నేటి యువతరానికి గుదిబండలా తయారైంది నిరుద్యోగ సమస్య. దీన్ని మనం దృఢ నిశ్చయంతో తొలగించుకోవాలి. అందరికీ ఉపాధి కల్పించాలి.

ఈ బృహత్తర కృషిలో భాగంగానే విద్యావంతులైన నిరుద్యోగులకు శిక్షణ ఇవ్వడానికి 1978 ఆగష్టు 15వ తేదీన రు. 5 కోట్ల ఖర్చుతో కూడిన ప్రత్యేక ఉపాధి పథకాల్ని ప్రారంభించారు.

1976-77 సంవత్సరం రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరిగాయి. ఉపాధి కేంద్రాల ద్వారా 52, 876 మందికి ఉద్యోగాలు కల్పించారు. గత సంవత్సరం కన్నా 34 శాతం ఎక్కువ మంది ఉద్యోగాలు పొందారు

సన్నకారు రైతుల అభివృద్ధి; లాభసాటిగాని రైతులు, వ్యవసాయ కూలీల పథకం; క్షామ పీడిత ప్రాంతాల అభివృద్ధి; పశుగణాభివృద్ధి. మొదలైనవి ఎన్నో కార్యక్రమాలు ఇప్పుడు అమలు జరుగుతున్నాయి. వీటి వల్ల 15 లక్షల మంది సన్నకారు రైతులు, లాభసాటిగాని రైతులలో 6.58 లక్షల మంది ప్రయోజనం పొందారు.

2½ ఎకరాల మాగాణీ, 5 ఎకరాల మెట్ట భూమి గల సన్నకారు రైతులను భూమి శిస్తునుంచి మినహాయించారు.

ఉత్సాహంతో స్వయం ఉపాధి సోపానాలను అధిరోహిద్దాం. నిరుద్యోగ సమస్యకు చరమగీతం పాడుదాం.

విషయసూచిక

అభ్యుదయ

ఆంధ్ర ప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం మద్రాసు శాఖ మాస పత్రిక

సంచిక 1, సంపుటి 3 జనవరి 1979 సాలు చందా: రూ. 10

వేకువ

అదృష్టదీపక్

త్రరతరాల చీకటిపై
తిరుగుబాటు జరుగుతోంది!
ఎరుపెక్కిన ఆశలతో
తూరుపు తెల్లారుతోంది!

ఆకలి మంటలు భువిలో
అంతరింప జెయ్యాలని
బాధల కేదారంలో
శోధన మొలకెత్తుతోంది!

ఉద్యమాలు ఊపిరిగా
ఉప్పొంగిన జనవాహిని
నరహంతల అహంకృతికి
చరమాంకం రచిస్తోంది!

చిరకాలపు దోపిడిలో
ఛిద్రమైన ప్రజాశక్తి
చెదపట్టిన ప్రభుత్వాల
కథను మార్చి దిద్దుతోంది!

సమభావం సృజియించే
శ్రమజీవన చైతన్యం
నరజాతిని నవ పథాన
నడిపించగ వస్తున్నది!

ఆంధ్ర అభ్యుదయ రచయితల ఉద్యమం
మూడున్నర దశాబ్దాల ఉజ్వల చరిత్ర

అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం 1936 లో స్థాపిత మైనప్పటికీ; తెలుగునాట, ఈ అభ్యుదయ సాహిత్యోద్యమం ఒక సంఘటిత రూపం సంతరించుకొనేందుకు భౌతిక పరిస్థితులు పరిపక్వం కావడానికి దాదాపు ఏడు సంవత్సరాలు పట్టింది.

1933 నాటికి దేశంలో ఉధృతంగా సాగిన రెండు సత్యాగ్రహోద్యమాలు బ్రిటిష్ సామ్రాజ్య వాదం నుండి స్వాతంత్ర్యాన్ని సాధించలేక పోవడంతో ఆంధ్ర ప్రాంతంలో వాటిలో పాల్గొన్న దేశభక్తులు తమ లక్ష్యసాధనకు కొత్త మార్గాలను అన్వేషించ నారంభించారు. సహజంగా వారు సోషలిస్టు భావాలచే ఆకర్షితులై ప్రజలను ఆయా వర్గ సంఘాల్లో సంఘటితపరచి, వారిలో సోషలిస్టు చైతన్యాన్ని పాదుకొల్ప నారంభించారు. 1934-43 మధ్య కార్మికులను, కర్షకులను ఉత్తేజపరచడానికై తెలుగు నాట అనేక ప్రబోధ గేయాలు వెలువడ్డాయి. సోషలిస్టు సిద్ధాంత గ్రంథాలుగా గోర్కి రచనలు తదితర సోషలిస్టు సాహిత్య గ్రంథాల ప్రచురణ ఆరంభ మయింది. 1934 లో వెలువడిన శ్రీ శ్రీ "మహా ప్రస్థానం," కవితా రంగంలో ఒక గుణాత్మకమైన మార్పు తెచ్చింది. ఇది పలాయన వాద ధోరణిలో పడిపోయిన భావ కవితోద్యమానికి భరత వాక్యమూ, అభ్యుదయ కవిత్వానికి నాందీ వాచకమూ కూడా. ఇది వెలువడిన కొద్ది రోజులకే "రైతు భజనావళి" వెలువడటం యాదృచ్ఛికం కాదు. అనేక తిరుగుబాట్లు - భావ కవిత్వంపై తిరుగుబాటు, దేవునిపై మతంపై తిరుగుబాటు, కుల మత వ్యత్యాసా లపై, అంధ విశ్వాసాలపై తిరుగుబాటు, ఛందోబద్ధ వృత్తాలపై, పాతపదబంధాలపై, పాత రూపచిత్రాలపై తిరుగుబాటు - జరిగిన దశ అది. ఇవన్నీ అభ్యుదయ రచయితల ఉద్యమ స్థాపనకు దోహదం చేసిన భౌతికాంశాలు.

1943 ఫిబ్రవరి 13, 14 తేదీల్లో తెనాలిలో ఆంధ్ర అభ్యుదయ రచయితల ప్రథమ మహాసభ జరిగింది.

సాహిత్యాన్ని ప్రజలకు సన్నిహితం చేయాలనీ, హేతవాద దృష్టితో పాత నమ్మకాలను, ఆచరణలను పరిశీలించాలనీ, ఆనాటి అభ్యుదయ రచయితల సంఘ ప్రణాళిక కోరింది. భారతీయ సంస్కృతిలోని సుసంప్రదాయాలను రక్షించుకొంటూనే, సమాజంలోని క్షీణధోరణులను నిర్దాక్షిణ్యంగా విమర్శిం చాలని ప్రణాళిక ఉద్బోధించింది. నిస్తబ్ధతనూ, నిష్క్రియాపరతను నిరసించింది. జాతి, మత కక్షలను, వర్గ దోపిడీని ప్రేరేపించే రచనా ధోరణులను ప్రతిఘటిం చాలని నిర్దేశించింది. సమాజంలో అభ్యుదయ కరమైన మార్పులకు దోహదం చేసే ప్రతి రచన అభ్యుదయకరమైనదని ప్రణాళిక నిర్వచించింది.

అయితే ప్రతి ప్రగతిశీల ఉద్యమంలాగానే ఈఉద్యమం కూడ ఛాందసులను ఎదుర్కొనవలసి వచ్చింది. ఈ సంస్థను ఏదో ఒక దేశ ఆజ్ఞానువర్తియై పనిచేస్తుం

దని, అకవిత, శుష్క నినాద కవిత్వం తప్ప అభ్యుదయ రచయితలమని చెప్పుకొనేవారు మరొకటి రాయరనీ విషప్రచారం సాగింది.

ఈ దుష్ప్రచారానికి జవాబు, మాటలతో కాక కార్యరూపేణా, కేవలం సభలూ, సమావేశాల ద్వారా కాక, నూతన సాహిత్య సృష్టితో అభ్యుదయ రచయితలు సమాధాన మిచ్చారు. జాతీయ పునర్వికాసానికి దోహదం చేసిన కందుకూరి, గురజాడ, గిడుగు, కొమర్రాజు లక్ష్మణరావు మొదలయిన వారిని సంస్మరించి, వారి వర్ధంతులు జరిపి, ప్రత్యేక సంచికలు వెలువరించి వారి ఆదర్శాలను ప్రచారం చేశారు. మరుగున పడిపోయిన ఈ నవయుగాంధ్ర నిర్మాతలను తిరిగి వెలుగులోకి తెచ్చిన ఘనత అభ్యుదయ రచయితల ఉద్యమానిదే అన్న వాస్తవాన్ని నేడందరూ అంగీకరిస్తున్నారు.

అంతేకాదు. అభ్యుదయ రచయితలు బుర్రకథవంటి దేశ సాహితీ రీతులను పునరుద్ధరించారు. ప్రజా నాట్య మండలిని స్థాపించి, ప్రజల్లో చైతన్యాన్ని రగుల్కొల్పే నాటకాల ప్రదర్శనకు తోడ్పడ్డారు.

ఆంధ్ర అభ్యుదయ రచయితల ద్వితీయ మహాసభ బెజవాడలో 1944 డిసెంబరు 29, 30, 31 తేదీల్లో జరిగింది. నవ్యసాహిత్య పరిషత్తు కార్యదర్శి శ్రీ తెలికిచెర్ల వెంకటరత్నం అధ్యక్షత వహించారు. ఈ సభ నాటికి దేశంలో అభ్యుదయ రచయితల సంఘ కృషికి మంచి గుర్తింపు వచ్చింది. మూడు తరాల వారు ఆ సభలో పాల్గొనడం ఇందుకు తార్కాణం. ఆ మహాసభ సందర్భంలోనే, చిలకమర్తి లక్ష్మీ నరసింహం గారిని సన్మానించి, వారి "స్వీయ చరిత్ర" ను ప్రచురించడం జరిగింది.

మహాసభ, దేశస్వాతంత్ర్యానికి సంబంధించిన తీర్మానాలనే కాక, ఉత్తర విశాఖలోని కరువు, ఆంధ్రదేశ చిత్రకళా ప్రదర్శన, విజయనగర సంగీత కళాశాల, ఆంధ్రలో కళాశాలల పరిస్థితి మొదలగు సాంస్కృతిక సమస్యలపై తీర్మానాలను ఆమోదించింది.

తృతీయ మహాసభ రాజమహేంద్రవరంలో 1945 డిసెంబరు 31 – 1946 జనవరి 1,2 తేదీల్లో జరిగింది. శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు అధ్యక్షత వహించారు. శ్రీ శ్రీ ప్రారంభోత్సవం చేసారు.

ఆ మహాసభ కాలం నాటి పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళిక రూపొందించబడింది. స్వతంత్ర భారత నిర్మాణాశయ సిద్ధికోసం కావించే కృషిలో అభ్యుదయ రచయితలు పాల్గొంటారని, ఐక్య ఆంధ్ర దేశ సాధనకు కృషి చేస్తారని ప్రణాళిక తెలియజేసింది.

తృతీయ మహాసభ నాటికి అభ్యుదయ రచయితల సంఘానికి 16 శాఖలున్నాయి. సభ్యత్వం 900 లకు పైబడింది సిద్ధహస్తులయిన రచయిత లెందరో సంఘంవైపు మొగ్గారు. చదలవాడ పిచ్చయ్య కార్యదర్శిగా, కొడవటిగంటి కుటుంబరావు, జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి సహాయ కార్యదర్శులుగా ఎన్నుకోబడ్డారు. చదలవాడ, కొడవటిగంటి, జలసూత్రం, తుమ్మల, ప్రయాగలతో సంపాదకవర్గమేర్పడింది.

అభ్యుదయ రచయితల సంఘం 1946 మే 11 నుండి జూన్ 19 వరకు గుంటూరు జిల్లా పెదవడ్లపూడిలో "ఆంధ్ర సాహిత్య పాఠశాల"ను నిర్వహించింది. 57 మంది రచయితలు, కళాకారులు, విద్యార్థులూ, పాఠశాలకు వచ్చారు. ప్రసిద్ధ శిల్పి దేవీప్రసాద్ రాయ్ చౌదరి ప్రారంభోత్సవం చేశారు. 14 అంశాలపై ఆయా రంగాల్లో నిష్ణాతులైన పండితులు, కవులు, విమర్శకులు ఉపన్యాసాలిచ్చారు. ఈ సంఘం అధ్వర్యాన సాహిత్య పత్రిక "తెలుగు తల్లి" 1944 మే నుండి 1946 మార్చి వరకు వెలువడింది.

నాల్గవ మహాసభ మద్రాసులో 1946 లో శ్రీ పి. వి. రాజమన్నారు అధ్యక్షతను జరిగింది. సుప్రసిద్ధ అభ్యుదయ రచయిత అబ్బాస్ సభను ప్రారంభించారు.

1948 – 52 సంవత్సరాల మధ్య అభ్యుదయ సాహిత్య ఉద్యమం ప్రభుత్వ దమన కాండకు గురి అయింది. మాస పత్రికగా వెలువడుతూ వుండిన 'అభ్యుదయ'ను ఆపి వెయ్య వలసివచ్చింది. అయినా ఆ విషమ సమయంలో కూడ అభ్యుదయ దృక్పథంకల రచయితలు వివిధ సాహిత్య పత్రికల ద్వారా అభ్యుదయ సాహిత్య వ్యాప్తికి కృషి చేశారు.

"విశాలాంధ్ర" పక్షప త్రిక, "నవసాహితి", "అరుణ రేఖ", "సంధ్య", "ఉదయిని", "దండోరా", "నగారా" "బృందావనం" – ఇలా ఎన్నో సాహితీ పత్రికలు ఐదవ సభనాటికి వెలువడినాయి. ఇవి అభ్యుదయ రచయితల సంఘ సమిష్టి అభిప్రాయాన్ని వ్యక్తీకరించకున్నా, వ్యష్టిగా అభ్యుదయ సాహిత్య ప్రచురణకు తోడ్పడ్డాయి.

1955 జూలై 30, 31 తేదీల్లో విజయవాడలో అభ్యుదయ రచయితల అయిదవ మహాసభ జరిగింది. మహాసభకు శ్రీ శ్రీ అధ్యక్షత వహించారు. మహాసభ సందర్భంగా "అభ్యుదయ" ప్రత్యేక సంచిక వెలువడింది. మహాసభ ఆహ్వాన సంఘ అధ్యక్షులు డాక్టర్ ఉప్పల లక్ష్మణరావు అభ్యుదయ రచయితల కర్తవ్యాన్ని గురించి సుస్పష్టమైన సూచనలు చేశారు.

వ్యావహారిక భాష, పురావస్తు ప్రదర్శనశాల, కేంద్ర గ్రంథాలయం, చిత్రకళా కేంద్రం, గ్రంథ నిషేధం, విశ్వశాంతి మొదలయిన విషయాల పై తీర్మానాలు జరిగాయి.

1955 తర్వాత, అభ్యుదయ రచయితల సంఘం "అభ్యుదయ" పత్రిక ప్రచురణను తిరిగి ప్రారంభించింది. 1959 వరకు నిర్వహించింది.

1955 తర్వాత దశకంలో సంఘ నిర్మాణం సన్నగిల్లింది. సంఘ పునర్నిర్మాణానికి జరిగిన ప్రయత్నాలు ఫలించలేదు. 1971లో ఉద్యమంలో ప్రముఖ పాత్రవహించిన శ్రీ శ్రీ, రమణారెడ్డి మొదలయినవారు దిగంబర కవులతో కలిసి "విప్లవ రచయితల సంఘాన్ని" ఏర్పరచారు. ఉద్యమం ఈ విధంగా చీలిపోవడం సరికాదని, ఒక సూత్ర ప్రాతిపదికపై రచయితలను ఐక్యం చేయడానికి జరిగిన ప్రయత్నాలు విఫలమయ్యాయి.

తరువాత గుంటూరులో 1973 అగస్టు 10 – 12 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘ ప్రథమ మహాసభ జరిగింది. (ఆంధ్ర ప్రదేశ్

ఏర్పడ్డాక ఇదే తొలి మహాసభ ; అందుచేత, ప్రథమ మహాసభ అని నిర్ణయించ బడింది.)

ఈ సభ అనంతరం అభ్యుదయ రచయితల ఉద్యమం నిర్మాణరీత్యా పటిష్ఠ మయింది. యువతరం ఉత్సాహంతో సంఘ కార్య కలాపాల్లో పాల్గొని దానిలో గుణాత్మకమైన మార్పు తెచ్చారు. హైదరాబాదు, కృష్ణ, గుంటూరు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కడప, నల్లగొండ, ఖమ్మం, కరీంనగరు, ఆదిలాబాద్ జిల్లాల్లో శాఖలు ఏర్పడి పని చేస్తున్నాయి. కొన్ని జిల్లాలలో వార్షిక మహాసభలు జరిగాయి. మహాసభల సందర్భంగా సావనీర్స్ ప్రచురించారు. ఇప్పటికి సుమారు 50 వరకు అభ్యుదయ సాహితీ సంకలనాలను వెలువరించారు.

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల ద్వితీయ మహాసభ హైదరాబాదులో 1976 ఫిబ్రవరి 14, 15 తేదీలలో జరిగింది.

ఈ విధంగా ఆంధ్ర సాహిత్య చరిత్రలో ఒక మహత్తర అధ్యాయాన్ని లిఖించిన అభ్యుదయ రచయితల సంఘం, కాకినాడలో జరుపుకోనున్న ఎనిమిదో మహాసభతో ఒక కొత్త మలుపుకు చేరుకోగలదని, నేటి దశకు అనుగుణమైన కొత్త కర్తవ్యాలను రచయితలకు నిర్దేశించగలదని ఆశించవచ్చు.

దృష్టి . . . . దేవరాజు మహారాజు

నా దేశపు ప్రతి అంగం మీదా పుళ్ళు
కుళ్ళును అందంగా ప్యాక్ చేసిన
గోపురాల గుళ్ళు.
ఈ రాళ్ళు రప్పలు
శిలలూ – శిల్పాలు,
చెక్కు చెదరని చెక్కడాలు
ముక్కు మూసుకు మొక్కడాలు
ఈ అనంత సౌందర్యాలు
ఈ అమోఘ కైంకర్యాలు . .
ఇందులో ఏదైనా సరే –
అజ్ఞాన గర్భకుహరం లోకి
నిర్జీవ మూఢాంధకారం లోకి
నిన్ను నీ తరాన్ని
లాక్కెళ్ళడానికి వేసిన గాలం ఎర
మనసుల చెర.

ఆ పక్షి చూడూ
తనువెల్లా అసహ్యంతో
దేవుడి నెత్తి మీద రెట్ట వేసి
స్వేచ్ఛలోకి ఎగిరిపోతోంది.
ఈ చెట్టు వ్రేళ్ళు చూడూ
పునాదుల్ని ఎలా తవ్వుతున్నాయో.
వాటికి తెలుసు
మనుషులు చెక్కిన ఈ – కృతులలో
మానవాకృతుల్నే చూడాలని !
దేవుడనే పదంలో
ఏ అక్షరానికీ అర్థం లేదని
ఈ కళ్ళతో ఇప్పుడు
ఇలా చూస్తే తెలుస్తుంది
నా దేశపు ప్రతి అంగంమీదా
ప్రపంచం తలలు వంచే
అనిర్వచనీయమైన సౌందర్యం వుందని

తమిళ కథల ఎంపిక
ఇలక్కియ చ్చింతనై కృషి

ఇలక్కియ చ్చింతనై మద్రాసులోని ఒక తమిళ సాంస్కృతిక సంస్థ. అర్థం సాహిత్య సమాలోచన అని. తమిళంలో ప్రచురింప బడుతున్న కథా సాహిత్యాన్ని పరిశీలించి ప్రతినెలా ఆ నెలలో వచ్చిన మంచి కథకు ఈ సంస్థ బహుమానం ఇస్తూంది. 12 నెలలలో ఎన్నిక చేసిన కథలలో శ్రేష్ఠమైన దానికి సంవత్సరాంతాన బహుమానం ఇవ్వడమూ, ఆ పన్నెండు కథలనూ ఒక సంపుటిగా ప్రచురించడమూ ఈ సంస్థ చేస్తున్న పని.

ప్రతి నెలా అఖరు శనివారం మద్రాసులోని ఒక హాలులో జరిపే సభలో, ఆ నెల జడ్జి తమ పరిశీలన ఫలితాలను వ్యాస రూపంలో చదువుతారు. ఈ విధంగా ఇప్పటికి 106 సమావేశాలు జరిగేయి.

సంస్థా నిర్వహణలో ఎదురవుతున్న సమస్యల్ని గురించి చెప్తూ నిర్వాహకులలో ఒకరయిన లక్ష్మణన్ ఇల్లా అన్నారు: 'దీనిని భారతి, నేను, మా సోదరుడు చిదంబరం నిర్వహిస్తున్నాం. దీనికి వేరే సభ్యత్వం, కార్యనిర్వాహక వర్గం అంటూ పెట్టి పేచీలు కొని తెచ్చుకోదలచ లేదు. సాలుకో మూడు వేలు ఖర్చు అవుతూంది. అది మేమే పెట్టుకుంటున్నాము.

"పత్రికలలో ఉత్తమాభిరుచులు పెంచడమూ, కథారచనలో నేర్పు సాధించే ఉత్సాహం రచయితలకు కలిగించడమూ మా లక్ష్యం. మేము ఏ ప్రత్యేక తాత్విక ధోరణుల్ని అనుసరించము. బలపరచము. కథలలో మంచిస్థాయి అనే దొక్కటే మాకు గీటురాయి. ప్రతినెలా వచ్చిన పత్రికలను కొని, ఒక జడ్జిని ఏర్పాటు చేసి వారి చేత పెడతాము. మంచో, చెడ్డో నిర్ణయం బాధ్యత వారిదే. వారి శ్రమకు 50 రూ. పారితోషికం ఇస్తాం. ఆ మంచి కథకు 50రూ. రచయితకు బహూకరిస్తాం. ఆ కథా రచయితకూ, దానిని ప్రచురించిన పత్రికకూ మా సంస్థ తరపున యోగ్యతా పత్రం ఇస్తాం.

"సంవత్సరం పొడుగునా ఎన్నికైన 12 కథలలో శ్రేష్ఠమైనదిగా జడ్జి ఎన్నిక చేసిన కథకు మరల 300 రూ. బహుమానం ఇస్తున్నాము. ఆ జడ్జిగారి పీఠికతో ఈ పన్నెండు కథలూ సంపుటిగా ముద్రించ బడుతున్నాయి.

"మొదటి రెండు మూడు సంవత్సరాలు ఆ సంపుటుల ముద్రణ భారం సంస్థమీదనే పడింది. అయితే తరువాత ఒక ప్రచురణ సంస్థ ముద్రణ, విడుదల బాధ్యతలన్నీ తీసుకొంది" అన్నారు భారతి.

ఆ సంపుటికి 2 వేల ప్రతులు ముద్రిస్తున్నారు. "బహుమతి ప్రదాన సభలో 2-3 వందల ప్రతులు చెల్లిపోతన్నా" యన్నారు, మరో ప్రశ్నకు, భారతి

నవంబరు 25 శనివారం జరిగిన సభలో అక్టోబరు నెల కథలు సమీక్ష చేసిన శ్రీ ఎస్. ఎస్. కణ్ణన్ ప్రసంగించేరు. "సంస్థ వారు అందచేసినవి గాక ఇంకా అనేక పత్రికలలో కూడా కథలు వస్తున్నాయి. నేను కన్నిమెరా

లైబ్రరీకి వెళ్లి ఇతర పత్రికలలో కూడా పరిశీలించాను. ఆ విధంగా నేను చదివి నవి 130 కథల వరకూ వున్నాయి. వాటిలో 80 పైగా ప్రేమ కథలు, సాంసారిక కథలూను. 30 వరకూ సమస్యల గురించి వున్న కథలున్నాయి. మన స్తత్వ విచారానికి ప్రాముఖ్యం ఇచ్చి నవి అరున్నాయం"టూ, 'కుంకుమ' పత్రికలో కల్యాణరామన్ వ్రాసిన "నిమ్మతి' (నెమ్మది) అన్న కథను తాను ఎన్నిక చేశామన్నారు.

కల్యాణరామన్ వివరాలకై పత్రికకు వ్రాసినా సమాధానం లేక పోవడం చేత, రచయిత గురించి ఏమీ చెప్ప లేకపోతున్నామని సభా నిర్వాహకులు శ్రీభారతి చెప్పేరు.

సభకు 50 – 60 మంది స్త్రీ పురుషులు వచ్చారు. వారితో అధిక భాగం కాలేజీ విద్యార్థులూ, వుద్యోగులూను.

ఈ సభలో శ్రీ అశోకమిత్ర అనే కథారచయిత టాల్‌స్టాయిపై వ్యాసం చదివేరు. ఆయనను కలుసుకోడానికీ ప్రసంగం వినడానికీ సభ్యులలో చాలా మంది ఆతురత కనబరచడం చూస్తే, రచయితలకు తమిళ దేశంలో కన బరచే ఆదరం కనబడుతుంది.

అశోకమిత్ర మాటల సందర్భంలో, తన జీవిక రచనల ద్వారానే అన్నారు. నేను ఆశ్చర్యపడ్డాను. "గొప్ప విషయ మేనే" – అన్నాను. "ఫర్వాలేదు. నెట్టుకొస్తున్నాను. నా కథ ఒకటి తెలుగులోకి అనువదించబడింది. ప్రతి ఫలం 75 రూ. లు పంపేరు. నాకు ఆశ్చర్యం కలిగింది. తమిళనాట అను వాదానికి ఎదురు డబ్బు ఇచ్చుకోవలసి వస్తుంది" అన్నారు ఆయన.

(మా విలేకరి).

అమ్మాయి పుట్టిందని వుత్తరం రాగానే అదిరిపోలేదు ఆదినారాయణ. — మురిసిపోయాడు. వుత్తరాన్ని ముద్దెట్టుకున్నాడు. ఒకటికి పాతికసార్లు చదివేడు. అంతటితో ఆగలేదు. కొలీగ్స్ నందర్నీ వున్న పాళాన టీస్టాల్ కి లాక్కుపోయాడు.

కథానిక

గండం

పసంత శర్మ

'కంగ్రాట్స్ .... కంగ్రాట్స్' అంటూ అందరూ అభినందనలు తెలిపేరు.

"రియల్లీ యు ఆర్ ఎ లక్కీ ఫెలో" అంటూ భుజం చరిచారు — తేనీరు చప్పరిస్తూ.

ఆదినారాయణకి అనంత మంత సంతోషం కల్గింది. టీ స్టాల్ నుంచి బైటికొస్తూ —

"అసలందరూ మొగ పిల్లాడే పుడతాడన్నారు. నాకు మాత్రం ఆడ పిల్లనే నమ్మకం. మా మిసస్ కూడా నాతో బెట్ కాసింది. ఆఖరికి నేనే గెల్చాను?" అంటూ తన పుత్రికా జనన వృత్తాంతాన్ని విన్నవించేడు ఆదినారాయణ.

"కానీవోయ్! ఈ ఖుషీలో ఓ పది రోజులు సి. యల్. తీసుకో. బారసాలా అన్నీ అయిన తర్వాత కుటుంబసమేతంగా రా!" అని తాను అడక్క ముందే ఆఫీసరు గారు లీవు గ్రాంటు చేసేసారు.

ఆదినారాయణకి ఆనందపుటంచులు తగిలేయి —

ఇంతవరకు ఏనాడూ తను అడగందే, అందునా కిందపెట్టీ మీదపెట్టీ ఏవో కంపాషనేట్ గ్రౌండ్సు సృష్టించందే లీవివ్వని ఆఫీసరు ఇవాళ తానుగా తనే పిల్చి ఇచ్చాడంటే ఏం వను కోవాలి?

— భార్య వేవిళ్ళతో వేధిస్తే మూడో నెలనే ఆమెను పుట్టింటి దగ్గర వది లొచ్చాడు. వచ్చిన పది రోజులకే ఆమె వుత్తరం రాసింది —

"డాక్టరుఇప్పట్నుంచే మీకు దూరంగా వుండొద్దంది. అందువల్ల నన్ను వెంటనే తీసుకెళ్ళండి. ముక్కోమూలిగో మీ దగ్గరే పడుంటాను" అంటూ.

ఆదినారాయణ వెంటనే లీవుకోసం అప్లయి చేసాడు.

ఆఫీసరు 'నాట్ గ్రాంటెడ్' అని రాసి పారేసాడు.

పదిహేన్రోజుల తర్వాత మళ్ళీ ట్రై చేశాడు. కానీ అప్పటి కింకో సమస్య వచ్చిపడింది.

— ఆ మహా పట్టణంలో అద్దె కొంప దొరకలేదు. మరిప్పుడు కడుపుతో వున్న భార్యను తీసుకొచ్చి ఎక్కడ పెట్టుకోవటం?

లీవుకోసం ఆఫీసర్నడిగి లేదని పించుకునే కన్నా భార్యకు కొంప దొరకలేదని రాస్తే! ... రాస్తే ఏంటి? రాసేసాడు.

గడిచిన ఏడు నెలల్లోనూ రెండు సార్లు మాత్రమే భార్యదగ్గర కెళ్ళ గల్గాడు — 'ముష్టి రెండ్రోజుల' లీవు తీసుకుని.

— అటువంటి దిప్పుడు ఆఫీసరు అడక్కుండానే లీవిచ్చాడంటే ఏం వను కోవాలి?

ఏదో ఒకటను కోవాలి. అంటే?

'పాప పుట్టిన వేళా విశేషం.' అని అందరూ అంటుంటే తనూ అనుకున్నాడు ఆదినారాయణ.

లంచ్ చేసి బైల్దేరేడు.

నాలుగ్గంటల బస్సు ప్రయాణంలో తన 'చిన్న కుటుంబం చింతలులేని కుటుంబం' గురించి కనవలసిన కలలన్నీ కనేసాడు. పాప తన పాలిటి 'లక్ష్మి' అనీ, 'అదృష్టదేవత' అనీ మురిసిపోయాడు. భార్యకి బదులుతనే 'కు. ని. ఆప్రేషను, చేయించు కోటానికి నిశ్చయించు కున్నాడు. ఒక పిల్లాడు, ఒక పిల్ల. ఇంకేం కావాలి ?

బస్సుదిగి ఇంటికెళ్ళాడు. భార్య ఆస్పత్రిలో పురుడు పోసుకున్నదట. గుమ్మంలోనే, బావమరిది ఎదురొస్తూ–

"బావగారూ! పాప ప్రేగు మెళ్ళో వేసుకు పుట్టిందట. నక్షత్రం గూడా మంచిది కాదట. మీరూ నేనూ నూనెలో మొహం చూడాలట. పెద్ద శాంతి చేయించాలట" అని.

జావకారిపోయాడు ఆదినారాయణ. ప్రయాణం బడలిక మరింత ఎక్కువైంది. ఉత్సాహం 'హుష్' న ఎగిరిపోయింది.

వెంటనే కూతుర్ని చూడలేక పోయినందుకు విచారించినా, గండాలమీదా దోషాలమీదా నమ్మకమున్న ఆదినారాయణ, బంధు వర్గం ద్వారా పాపరూపు రేఖల్ని మనో నేత్రంగుండా చూశాడు.

తర్వాత దిగులుపడ్డాడు. పాప జన్మనక్షత్రం మంచిది కాదు. పెద్ద శాంతి చెయ్యాలి. లేకపోతే తండ్రి గండంట. ఎంతఖర్చవుతుందో అని విచారిస్తుంటే, ఎనిమిది, తొమ్మిది 'వ'కారా లవ్వచ్చని చెప్పేసారు పురోహితుల వారు.

ఆదినారాయణ గుండె గడగడలాడింది.

అంత డబ్బెక్కణ్ణించి తేగలడు ?

కూతురికి శాంతి చెయ్యకపోతే తనకొచ్చే గండం కన్నా ముందీ డబ్బు గండం నుంచి ఎలా బైట పడాలి? తల బద్దలు కొట్టు కున్నాడు ఆదినారాయణ. చిటికెడాశతో ...

వెంటనే దగ్గర స్నేహితు లందరికీ ఉత్తరాలు రాసాడు — కష్టాల్ని చూపించి, గట్టెక్కించ మని చెయ్యి చాస్తూ.

జవాబులు సుముఖంగా వచ్చేయి.

వెంటనే అప్పు పుట్టినందుకు పాప అదృష్టాన్ని మరోసారి మెచ్చుకున్నాడు.

పదకొండో రోజున —

కూతురికి శాంతి చేయించిన తర్వాత బ్రాహ్మడు 'ఆయురారోగ్య ప్రాప్తిరస్తు' అని దీవిస్తున్నప్పుడు సంతోషానికి పగ్గాలు వెయ్యకలేపోయాడు ఆదినారాయణ.

కూతురి జన్మ దోషాన్ని, ఏ లోటూ లేకుండా రూపు మాపినందుకు ఎంతో ముచ్చట పడిపోయాడు.

కానీ . . . .

ఆ తర్వాతి రోజున శివరాత్రి సముద్ర స్నానాలకు వెళ్ళొచ్చిన ఆదినారాయణ డోకులు, విరోచనాలతో అవిరామంగా పోరాడి కన్ను మూశాడు – శాశ్వతంగా.

"అబ్బే! శాంతి జరగ వలసిన రీతిలో జరిగితేగా ! అందుకే తండ్రి బలైపోయాడు." అనీ, 'పుట్టిన బిడ్డ నష్ట జాతకురాల' నీ 'సప్లిమెంటరీ ఎడిషన్' రిలీజు చేసింది లోకం.

గురజాడ సంప్రదాయ కవిత

శివలెంక ప్రకాశరావు

గురజాడ పేరు వినడంతోటే మనకు మొట్టమొదట గుర్తుకొచ్చేవి ఆయన వ్రాసిన ముత్యాల సరాలూ, కన్యాశుల్కం నాటకం. అయితే మాత్రా ఛ్ఛందస్సులో ఉన్న ఈ ముత్యాల సరాలే గురజాడ వారి మొదటి రచనలు కావనే విషయం గుర్తుంచుకోవాలి. గురజాడ ఆ నాడు అందరి లాగానే సంస్కృతం చక్కగా అభ్యసించిన వాడు, తెలుగులో పద్యాల కంటె సంస్కృతంలో శ్లోకాలు అల్లడం తేలిక అనే భావం కలవాడు. అయినా తనకు అండగా నిలిచిన ఆనంద గజపతి ప్రోత్సాహంతో తెలుగు ఛందస్సు నేర్చుకొని కొన్ని పద్యాలు వ్రాశాడు. అలాంటి వాటిలో ముఖ్యమైనవి పుష్పలావికలు, మాటలు – మబ్బులు, మెరుపులు, సుభద్ర, ఋతశతకం.

'మాటల మబ్బులు' అనే శీర్షిక క్రింద 'ముత్యాల సరాలు' లో (విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ – విజయవాడ వారి ఏడవ ముద్రణి – ఏప్రిల్ 1975) నాలుగు పద్యాలు మాత్రము ఉన్నాయి. ఇవన్నీ విజయనగరంలోని అధికార మదాంధుల నధిక్షేపిస్తూ రచించినవే!

"దబ్బరలుం గొండెమ్ములు
మబ్బువలెంగ్రమ్ము మాయమాటల తీపున్
నిబ్బరపు మొండితనమును
నబ్బురమగు విద్యలచటి యధికారులకున్."

అని వారిని దుయ్య పట్టాడు గురజాడ.

అయితే ఇందలి పదాలు ప్రాసకోసం వేసినవని స్పష్టంగా కనవస్తాయి. 'మబ్బువలెంగ్రమ్ము మాయ మాటల తీపున్' అని అనడంలో అర్థ పుష్టి కూడా కొరవడింది.

మహాత్ములు నీచుని కడకు ఏదో పని వుండి వచ్చినంత మాత్రంతోనే వాళ్లను హీనంగా చూడవద్దని అన్యాపదేశంగా అధికార దర్పంగల వారిని అధిక్షేపిస్తూన్న ఈ పద్యం గమనించండి. –

"విధివశమున నీ చెంతకు
మధుపము రా హేళనంపు మాటాడకుమా
మధువొలుకు జలజకులముల
కధికపు నెయ్యుఁడగు కుటజమా! తెలియు మెదన్!'

"కర్మకాలి నీదగ్గఱకు వచ్చిన తుమ్మెదను గేలిసేయకు. నీకంటె ఎక్కువ

మధువందించగల పద్మాలకు అతడు చెలికాడని తెలుసుకో'' అని హెచ్చరిక.

ఈ పద్యాలు శైశవావస్థలోనే ఉన్నాయని చెప్పక తప్పదు. అయినా గురజాడ తరువాతి కవితాధోరణికవి ప్రథమ సోపానాలుగా శాశ్వత కీర్తిని పొందినాయి.

తరువాత పేర్కొనదగినవి గురజాడవారి 'పుష్ప లావికలు'. తెలుగు సాహిత్యంలో 'పిల్లల మఱ్ఱి' నుంచి ఊడలు దిగి 'ఆంధ్ర భోజుని ' పోషణంలో ఒక విధమైన ప్రత్యేకతను సంతరించుకున్న ఈ పుష్పలావికలు గురజాడతో కూడ సరసా లాడడానికి వెనుకాడలేదు. ఇవి మొత్తం తొమ్మిది పద్యాలు. ఉదాహరణకు -

నీ దండ చిక్కుపడెనే
నా దండను చిక్కటన్న నగరే ప్రాజ్ఞుల్
నీ దండ నుంచి కొనుమా
వాదుడుగు మటందు రచటి వనితలు విటులన్'

ఈ పద్యానికి 'వెలది యీ నీ దండ వెల యెంత ? నా దండకును వెలబెట్ట నెవ్వని తరంబు?' అనే ఆముక్తమాల్యద పద్యం మూలమని స్పష్టంగా తెలుస్తున్నది. అందుకే 'ఆముక్తమాల్యదలోని పుష్పలావికల చెల్లెళ్లే అప్పారావు గారి పుష్ప లావికలని'' సి. నా. రె. విమర్శించారు.
మరొక పద్యం చూడండి -

'చూతము మీ మీ జాతుల
నాతిరొ యన విటులు బల్క నగి లావికలున్
ప్రీతిగల దేని జాతులు
జూతురె మా జాతులెల్ల జోద్యములనరే!'

ఇచ్చట జాతులనడంలో జాజిపూలనీ, స్త్రీ జాతి భేదాలనీ శ్లేష. అయితే అంతగా పూర్వ కావ్యానుసరణాలైన ఈ పద్యాలలో భావ పటుత్వం లేదు.

'మెరుపులు' అనే శీర్షికలో అచ్చు పడిన ఈ పద్యాలు ప్రసిద్ధ శ్లోకాలకు తెనుగు సేత అయినా పై రచనలకన్న మేలు.
ఉదాహరణకు -

నాల్గురీతుల గనకంబు నాడెమగును
వేటుగీటుల తునియించి వెచ్చజేసి
నరుడు నట్టుల నాల్గింట నాడెమగును
కులము శీలంబు కర్మంబు గుణముచేత.

దానికి - యథాచతుర్భిః కనకం పరీక్ష్యతే
నికర్షణచ్ఛేదన తాపతాడనైః

తథా చతుర్భిః పురుషః పరీక్ష్యతే
కులేన శీలేన గుణేన కర్మణా'

అనేది మూలం

ఒకసారి ఆనంద గణపతి తన కొలువులోని పండితులకు 'సతతము సంతస మొసంగు సత్యవ్రతికిన్' అనే సమస్యనిచ్చి పూరించ మన్నాడు. ఒక్కొక్కరు ఒక్కొక్కరకంగా పూరించారు. అదే సందర్భంలో గురజాడ కూడ పూనుకొని 'ఋతశతకంగా' ప్రసిద్ధి చెందిన కొన్ని పద్యాలు రచించాడు. అవసరాల వారు 25 పద్యాల వరకూ సేకరించారు. ఇవన్నీ ఒకే ప్రాసతో ఉండటంవల్ల చికాకు కలుగుతుంది. దానికితోడు గురజాడ కవిత్వ పటుత్వసంపద కొరవడిపడిన అవస్థలు స్పష్టంగా ఈ పద్యాలు అద్దాలలో చూపిస్తాయి. భావాలు కూడా చాలా అస్పష్టంగా అస్తవ్యస్తంగా కనిపిస్తాయి.

వినాయకుడికీ, వాణికీ సంతోషం కలిగేటట్లు శతకం వ్రాస్తానని చెప్పే ఈ పద్యం చూడండి మచ్చుకు -

'స్మితమతి సూఛీభేదిత
ఋతమౌక్తిక పదక శతక మిభపతి భాషా
సతి కతికుతుకత గూర్చగ
సతతము సంతస మొసంగు సత్యవ్రతికిన్.'

'సుభద్ర' అనేది మూడాశ్వాసాల కావ్యం. గ్రాంధిక భాషావాదులపై తిరుగుబాటుగా వ్యవహార సిద్ధరూపాలనే వాడాలని గురజాడ చేసిన తీర్మానానికి ఈ కావ్యమొక ముఖ్యోదాహరణం. ఈ రచనకు చేమకూరవారి విజయ విలాసం మూలమయినా గురజాడ అక్కడక్కడా తన శైలిని రుచిచూపినాడు. పండిత సవాలును ఎదురుకొని గురజాడ వ్రాసిన ఈ అసంపూర్ణ పద్యకావ్యంలో బుద్ధిపూర్వకంగానే వ్యాకరణ నియమాలను ఉల్లంఘించాడు. విజయ విలాసంలో ద్వితీయా శ్వాసం కొంతభాగం గడిచినప్పటి నుండి ఈ సుభద్ర కావ్యం ప్రారంభమవుతుంది.

'పండుగ దండిగ బర్వెను
గొండకు నలుగడల; నొక్కకోనను విడిగా
నుండి కిరీటియుఁ గృష్ణుడు
మెండగు మంతనములందు మెలఁగెడు వేళన్'

అదే సమయంలో 'అలకాంతములల్లలనాడ, దెమ్మెరన్ జెంత వనాంతము న్వెడలి చేరజనం దొవకావి చీరపై వింత మెఋుంగు రశ్మికలు వెల్వగ బంగరు కత్తళంబు విక్రాంత విలాసముల్ నడలఁ గన్నుఁ జెన్నులు వెల్లి గొల్పుచున్' వచ్చి ఒక కాంత హరిప్రక్కన నిలబడిందట. ఆమె ఎవరో కాదు సుభద్రయే. ఆ సోయగం అర్జునుని ధైర్యం క్రింద చేసిందట. అప్పుడు కృష్ణుడామెతో ''అమ్మా! ఇమ్మౌని

కరుణవల్ల సౌభాగ్యము కంటావు''. అని పలికి కపట మునిని "ఎవరీమె భర్త అగునో తెలుపు'' మంటాడు. కాని అర్జునుడు మాటాడక పోవడంతో మళ్ళీ కృష్ణుడే తెలిసినా ఇలాంటి సిద్ధులు కొత్త వారి కడ దాస్తారు. కాబట్టి

"కేవల నరుడే యీతడు
భూవలయము చుట్టి పుణ్యభూము లరయుచున్
రావలసి వచ్చెనిట నినుఁ
బ్రోవను ; సేవించి వేడ్కఁబొందుము శుభముల్.' (1 - 14)

అని నర్మగర్భంగా అంటాడు. దీంతో సుభద్రార్జునులు తమ ఆలోచనలకు అనుగుణంగా భావిస్తారు.

సుభద్ర "నరుగూర్చిన నరు గూర్చును నరుఁ గూర్పక యున్న నాకు నరుఁడై గురుడై దరిఁజేర్చు'' నని దలంచింది. ఆమె అందాన్ని చూచి "వీరుడన్నవాడు, వీరంబుగల యిట్టి భామనేలు భాగ్యమొదవె నేని గాలముండు దనుక గత లందు నుతికెక్కు' నని అర్జును డనుకొన్నాడు.

ఇంతలో బలరాముడు వచ్చాడు. "కురువీరులలో నేర్చు మగడీత డితం డని యేర్చుచు వాదిడిరి బాలురు''. కాన అర్జునుడిమీద పక్షపాతంమాని ఉన్నమాట చెప్పుమని'' కృష్ణుణ్ణి అడిగాడు. "ఈ మేటి తపసి ప్రక్కనె యుండన్ ఇతరు లెట్లు చెప్పగలర''న్నాడు కృష్ణుడు. ఇదే సందని బలరాముణ్ణి పొగడుతాడు నరుడు. దానికి ఉబ్బి తబ్బిబ్బయి 'మన సుభద్రయు నీ తపసిని బనిగొని సద్భక్తి భోజ్య భక్ష్యంబులచే దనిపెడుగా కద్దానను, గనకన్నె రాజరాజు గాంతుని గాగన్' (1-46) అని బలరాముడు సుభద్రను నరునికి పరిచర్య కోసం నియమిస్తాడు. అంతేకాక

"కలపవలె మీరు భద్రకు
నిరపాయ సుఖంబు లిచ్చు నీతి పథంబుల్
వరమీవలె నెనరెటిఁగిన
నరవరు మీయట్టి శాంతు నాథు బడయగన్.' (1 -54)

అని బలరాము డనడంతోనే 'తథాస్తు'ంటాడు మాయ నాటక సూత్రధారి కృష్ణుడు. బలరాముడు వెళ్ళిపోతాడు. ఈ విధంగా ప్రథమాశ్వాసం ముగుస్తుంది. విజయ విలాస గాధకిది కొంత భేదం కల్గి ఉంది. ఇది గురజాడ కావాలని చేసి నట్లుంది. ఇకరెండవ భాగంలో

'కస్తూరి గన్నేరు కావిచీర మెఱుంగు
మేనిఛాయకు వింత మిసిమిఁ గొలుప
చెలరేగు ముంగురుల్ చేర్చి కట్టిన జోతి,
యిరులపై రిక్కల కరణి వెలుఁగ

పైట పైఁ దూలెడు పచ్చల హారముల్
చలదింద్ర చాపంబు చాడ్పుఁ జూప
నిద్దంపుఁ జెక్కుల దిద్దిన పత్రముల్
మకరాంకు బిరుదాల మాడ్కి వఱల
మెఱపు కెమ్మబ్బు లోపల మెఱయునట్లు
వలిపమున మేల్మి మొలనూలు తళుకులీన
భద్ర నడతెంచె బంగరు పళ్లెరముల"
బండ్లుఁ బూవులు గొనుచు సపర్య కొఱకు."

అని పూర్వ ప్రబంధ ధోరణి కేమాత్రం తీసిపోకుండా వర్ణించాడు గురజాడ. "ఒకరకంగా ఈ పద్యం" చేమకూర చందురు కావిపావడ .... (2-130) నుంచి జారిపడిందే!

ఆ రకంగా రంగంలో ప్రవేశించిన సుభద్రకు యతిరూపంలో ఉన్న నరుని జూచి మతిపోయింది. 'యతి మీదికి మతిపోవుట మతిపోవుటగాఁ దలంచి మానిని' ... 'మరులు మరులుపగా' ఎంతో ప్రయత్నించింది. వదినలు, చేటులు నవ్వుతారని జంకింది. అదీకాక తానెప్పుడో 'నరుని' తన వానిగా తలచుకొన్నది. మరిప్పుడు ఈవింత ఏమిటి?

గురజాడ తన హాస్య ధోరణిని ఇక్కడకూడా చొప్పించాడు. చూడండి –

"జగదేకవరునకు నే
నగుదును దగు వీరపత్నినని తలఁచి మదిం
దగిలి విలువిద్య నేర్చితి
నగవుగదా తపసి కప్పనము సేఁత కడున్"(2-9)

అందుకే నలుగురిలో నవ్వులపాలు కాదలచుకోలేదు సుభద్ర. 'పో నొల్లను యతికడకిఁకఁ గాని మేమ్మైన' అని నిశ్చయించుకొని 'పడకింటికిఁజని' చాలా సేపు ఏడ్చిందట! 11 పద్యాలతో. దీంతో 2 వ భాగం ముగుస్తుంది. అనుకోకుండా ఇది మూలకథకు పూర్తిగా గురజాడ చేసిన మార్పు.

మూడవదీ చిట్టచివఁదీ అయిన తరువాతి భాగంలో సుభద్రను యతీశ్వరుని కడకేగుమని రుక్మిణి ఉద్బోధిస్తుంది. నరుని దెత్తునని కృష్ణునకు వాగ్దానం చేసిన యతిమాట నమ్మవలసిందని నచ్చచెపుతుంది. ఇదే సందర్భంలో 'చేమకూరను' మఱిచేటట్లు 'కందకూర'ను తినిపిస్తాడు గురజాడ. ఉన్న తొమ్మిది పద్యాల్లో మొదటిది తప్ప మిగిలినవన్నీ అందమైన కందాలే! 'అల్పాక్షరములలో అనల్పార్థ రచనః' కివి మచ్చుతునకలు. గురజాడ తిరమైన జాడకివి వాడలు. చూడండి –

"రారాదొకొ యతి యీశుడు
రారాదొకొ నిన్నుఁ బ్రోవ రమణిరో వటుఁడై (పక్క పుటలో)

సృష్టి

పిడుగు పడింది. మెరుపు మెరిసింది. మేఘం ఉరిమింది. ఈదురు గాలి ప్రారంభమైంది. వర్షం హోరున కురుస్తోంది. పూచిన పువ్వులు కాయలూ ఊగుతున్నాయి పరవశంగా.

సంతపేట బారకాసు మూలలో ఎండిన కుక్క బొమిక కొరుక్కుంటూ బాధపడుతోంది. ఆకలి తీర్చుకోడానికి అవస్థలు పడుతోంది.

తడికల చాటున నొప్పులు పడుతోంది పిచ్చిది. అడుక్కునే ముసిల్ది పురుడు పోస్తోంది.

ఊరు నిండా రకరకాల విషప్పాములున్నాయి. ఏ పాము పిచ్చిదాన్ని కరిచిందో - కడకి పిల్లోన్ని కంది.

'ఎవరు నా తండ్రి'? అన్నట్టు పిల్లోడు కేరు మంటున్నాడు. తల్లి స్తనాలు పట్టుకు చీకుతున్నాడు.

ఊరంతా పిచ్చిదాన్ని చూసి నవ్వుకుంటోంది.

సృష్టి మాత్రం 'ఇది ధర్మమే' అనుకుంటూ మౌనంగా ఉంది.

జి. నరసింహామూర్తి

కలియుగ ఖర్మ

తాలూకా ఉపాధ్యాయ సంఘం తమ గోడు విన్నవించుకోవడానికి ఆ కొత్త కాలేజీ ఆవరణలో సరికొత్త ఎమ్మెల్లే గారిని ఆహ్వానించి బ్రహ్మాండమైన సభ జరుపుతున్నారు.

పెద్ద పెద్ద వాళ్లు, చిన్న చిన్న వాళ్లు ఉపన్యాసాలు దంచేస్తున్నారు.

అయితే కాలేజీ ఛైర్మన్‌గారి కూడా ఉపన్యాసానికి అవకాశం యివ్వక పోతే బాగుండదని మాట్లాడమన్నారు.

ఆయన గారు చాలా చాలా చెప్పకు పోయి కడకిలా అన్నాడు.

''మా కాలేజీ దివ్యంగా నడుస్తోంది. అదంతా నా కృషిని వేరే చెప్పుకోవడం సభ్యత కాదనుకుంటా. మరో చిన్న విషయం - మా కాలేజీ లెక్చరర్స్‌కి పది నెలల నుంచి జీతాలు అందక పోయినా సమ్మె చేయడం లేదంటే వారి విశాల హృదయాలకి ఏ కవి నిర్వచనం చెప్పగలడు! - కాదంటే చెయ్యమనండి చూస్తా - కాలేజీ మూసి పారేస్తా.''

అది వింటున్న లెక్చరర్స్ మరింత కింది కుంచుకున్నారు తలలు.

జి. నరసింహామూర్తి

తాఁ రాఁడొకొ యిటకు నరా
కారంబన నెంత యతికిఁ గరుణఁ గలిగినన్.'' (3-6)
''సిగ్గఱవలె నొక్కొక తఱి
నెగ్గులఁ దొలగింపఁ గోరు నింతులు; దానన్
లగ్గులు చేకుఱు మరినే
సిగ్గని నాఁ డూరకున్నఁ జిక్కునె హరియున్.' (3-7)

అంటూ తన ధైర్యసాహసాలను నూరిపోసింది రుక్మిణి. దాంతో 9 పద్యాలతోనే ఈ ఘట్టం అర్ధాంతరంగా ఆగిపోతుంది. ముందుకు సాగక పోవడం మన దురదృష్టం. లేకపోతే గురజాడ ఇంకా ఎన్ని సంప్రదాయరుచులు వడ్డించే వాడో మరి!

ఆలోచన - ఆవేదన

జి. యస్. మోహన్

ఆలోచిస్తున్నకొద్దీ ఆలోచనా పరంపరలు
నా మస్తిష్కంలో భీకర తుఫానును రేకెత్తిస్తుంటాయి
నిరాశా నిస్పృహల తుంపరలు వేడిగా, వాడిగా
నాసున్నిత హృదయంలో శూలంలా చొచ్చుకు పోతుంటే
ఒకసారి ప్రకృతిమీద మరోసారి
మానవుని వింతప్రవృత్తిమీద ఏవో ఆలోచనలు .....

అసలీ చెట్టూచేమా ఎందుకు పుట్టాయనీ ?
గొడ్డూగోదె ఎల్లా జీవిస్తున్నాయనీ ?
మనిషికి మాత్రమే మాటలెందుకని ?
పుట్టిన వాడేనాటికైనా గిట్టడమెందుకనీ ?
సృష్టికర్త అనేవాడెవడైనా ఉన్నాడా అనీ
ఉంటే ఎందుకు అగుపించడనీ
ఏవేవో పిచ్చి పిచ్చి ఆలోచనలు ....

ఈమారు నా ఆలోచన దేశకాల పరిస్థితులపై మళ్ళింది
ఒకచోట అనావృష్టి, మరోచోట అతివృష్టి
మరి అన్నిచోట్ల అధిక ధరలు సామాన్యుణ్ణి పీల్చేస్తుంటే
అవినీతి, అధికారదాహం అంధకారంలో తోసేస్తుంటే
దగాలు, దోపిళ్ళు మనిషిని దోచేస్తుంటే
రోగాలు, రొచ్చులు జీవచ్ఛవంలా విసరి పారేస్తుంటే
నిరుద్యోగం భయంకర విషసర్పమై కాటేస్తుంటె
మతాలు కులాల పేర్లతో మానవజాతినే తోసేస్తుంటే
నీతి నిజాయితీతో బ్రతకాలను కొన్నవాడు
చాతికంటె హీనాతి హీనంగా చూడబడుతుంటే
నిస్వార్థంగా జీవించాలను కొన్నవాడు
స్వార్థపరుల కంబంధ హస్తాలలో నలిగి నశిస్తోంటే
మంచిగా బ్రతకాలనుకొన్నవాడు
పచ్చి మంచినీళ్ళకు కూడా నోచుకోని అభాగ్యుడవుతోంటే
దేశం పురోగమిస్తున్నదంటూ నాయకులు చేస్తున్న
'వ్యర్థ' ప్రసంగాలు 'ఉట్టి' కబుర్లుగా మిగిలిపోతుంటే
దేశం స్వయం పోషణకై పోరాడుతున్నదంటూ
చెప్తున్న పెద్దలే స్వయంపోషకులు అవుతుంటే ......

పిచ్చి పిచ్చి ఆలోచనలు గాక మరేం వస్తాయ్
నా ఆలోచనల పట్టిక నిక్కడ ప్రకటిస్తే
అదో ఉద్గ్రంథమే అవుతుంది
చెప్పకపోతే నా బుర్రవేడెక్కి పోతుంది
నా ఆలోచనలకు అంతులేదు
నా ఆవేదనకు అంతంకానరాదు

(మినీ కథ)

వెర్రిబాగులోడు

ఏ. శారద

"రిక్షా" శివరావు పిలిచాడు. అతని అడుగులు తడబడుతూవున్నాయి. మాటలు ముద్దగా వస్తున్నాయి. కష్ట పడుతున్నా గూడా స్పష్టంగా పలకడం లేదు.

"నెహ్రూ పార్కు తెలుసుగా?"

"తెలుసు బాబూ!"

"ఆ పక్క వీధిలోకి పోవాలి."

"పదండి బాబూ! పోదాం! ఎక్కండి మరి!"

"ఎంత కావాలి?"

"తమరి యిష్టం బాబూ!"

"అలా మొహమాటంలో పడేయకు నన్ను. నాదసలే జాలి గుండె."

"సరే! రూపాయినన్నర యివ్వండి."

"రూపాయిన్నరా యింకేమన్నా నా? రూపాయి యిస్తాను. వస్తేరా. లేకుంటే యింకో రిక్షా చూసుకుంటాను."

కొంచెం బెట్టుచేసి చివరకు ఒప్పుకున్నాడు రిక్షావాడు. శివరావు బండెక్కాడు గర్వంగా, తన మాట సాగినందుకు.

'బ్లూ' రెస్టారెంట్‌లో ఫ్రెండ్సు పార్టీ చేశారు శివరావుకి. తెల్లగుర్రం మీద అనేకసార్లు రౌండ్లు కొట్టాడు. టైము గడిచిందే తెలియని మనోలోకపు వీధుల్లో విహరించి, విహరించి చివరికి బయటకు వచ్చాడు.

రిక్షా తప్ప మరే వాహనమూ కంట బడలేదు.

"వచ్చేశాం బాబూ!"

"ఆఁ.. వచ్చేశామా! ఆఁ.. తెల్ల బిల్డింగు ముందు ఆపు."

రిక్షా ఆగింది.

"ఇంద ... తీసుకో."

రూపాయినోటిచ్చాడు శివరావు. రిక్షావాడు కదల బోయాడు.

"ఇదిగో. యింకా అర్ధరూపాయి యివ్వవద్దా! చిల్లరలేదు. నలభై పైసలే వున్నాయి. ఫరవాలేదా?"

సరిగ్గా నిలబడ లేక పోతున్నాడు శివరావు.

"పరవాలేదు బాబూ! తమరి యిష్టం అని ముందే చెప్పానుగా!"

రిక్షా కదిలింది.

"పాపం ఎంత వెర్రి బాగులోడు!" అనుకున్నాడు, శివరావు ముందుకు నడుస్తూ.

వ్యత్యాసం

కలచవీడు మురళీధర్

వెన్నెలాడు వారిన కొమ్మమీద
గొంతు విప్పింది కోయిల.
శిథిల కుటీరాన
తల్లి ఊపింది ఊయెల.
ఋతువును మార్చాలని
కోయిల ఆలాపన.
బ్రతుకును ఈడ్చాలని
కన్నతల్లి ఆవేదన.
రెండిటికీ వ్యత్యాసం రవ్వంతే.
ఇద్దరిలో వినిపించేది వొకేగొంతే.
ఉన్నది మారాలని.
లేనిది రావాలని.

కథానిక

తీర్పు

మ. రా. శాస్త్రి

రుద్రాయ పాలెం మొత్తానికి రుద్రయ్యను మించిన పెద్ద, తగవరి, మోతుబరి లేడు. పాలెం అనగానే, అది మరో అగ్రహారానికి చేరివున్న పాలెంగా అర్థంచేసుకో కూడదు. రుద్రాయ పాలెం ఓ వూరు.

అన్ని వర్ణాల వాళ్లూ ఆ వూళ్ళో వున్నా రుద్రయ్యా వర్ణంది మెజారిటీ. కనుక, ఆ వర్ణంలో రుద్రయ్యా కున్నంత పెద్ద పిర్రలు మరెవరికీ లేవు కనుక, రుద్రయ్యా పెద్ద అయేడు! ఏ తగు వొచ్చినా, తుది తీర్పుకి అతడే దిక్కు. కనుక తగవరి అయేడు! ఎవరి సొమ్ము యింత వరకు అపహరించి అన్యాయం చెయ్యలేదు కనుక, మోతుబరే మరి!

అతని పెద్దరికాన్ని గురించి మాట్లా డ్డానికి లేదు! పెద్ద పిర్రలుండడం అర్హతగా భావించి, అధిక జనాభా అతడినే పెద్దన్నారు; దానికి తిరుగు లేదు.

మోతుబరి తనాన్ని శంకించలేం! అప్పు పుచ్చుకుంటే ఎగ్గొట్టేవాడో తీర్చే వాడో! అప్పుచేసే అవసరమే కలగ లేదు! అయినింట ఇల్లరికానికి వచ్చేడు. మావగారు బంగారంలాంటి రెండు చెక్కలు రాసి యిచ్చేడు. పెద్ద చెక్కని పైలాడు చేత దున్నిస్తున్నాడు. ఇంటి నానుకునే వున్న చిన్న చెక్కని స్వయంగా దున్నుకుంటున్నాడు. పిల్లా పాప లేరు! అంచేత మోతుబరి తనాన్ని పరీక్షించ నక్కరలేదు.

తగవరితనం పరీక్షించాల్సిందే! తలలు నెరిసిన న్యాయమూర్తుల తీర్పులన్నే ప్రజలు లెక్కచెయ్యక తూర్పారబెడుతున్నారు! పోనీ, ప్రజలు కాదు, ప్రజా నాయకులు! అబ్బ! అలాగే అందాం; నాయకులూ కాదు – నాయకు రాళ్లు! సరేనా?

అవునా? అటువంటిది, రుద్రయ్యా తీర్పు అంతగా ప్రజామోదం ఎలా పొందుతూందా అని నా శంక?

శంకంటూ కలిగేక, ఎలాగో అల్లా తీర్చుకోకపోతే కడుపు ఉబ్బుతుంది కదా?

* * *

సాయంత్రం ఏడు గంటలే అయినా, ఎంతో రాత్రయినట్లుంది. అమ్మవారి గుడిగోడల మీద బూతు రాతలు కనుపించనంత చీకటి పడిపోయింది. సినిమాకి పోతూ, అంతకు రెండు గంటల ముందరే వీధి దీపాలు వెలిగించి పోయేడు పంచాయతీ గుమస్తా. అంత వరకూ వెలిగి వెలిగి అప్పుడే ఆరి పోయాయి, కరంటు పోయిన మూలంగా.

మూగనోము పట్టిన కొత్తూరి వారి కొత్తకోడలు యింటింటా బొట్లు పెట్టి, అక్షింతలు వేయించుకొని యింటి ముఖం పట్టింది. అమ్మవారి గుడి దగ్గర కొచ్చే సరికి లైట్లు పోయాయి. చీకటి.

నడుస్తూ నడుస్తూన్న కోడలు పిల్ల మూగ వ్రతం మాటకూడా మరచి కోడిపిల్లలా అరచింది. కేకలు, అరుపులు! "ఏవిటయింది?" అంటూ జనం మూగేరు.

జరిగింది చెప్పింది, – కొత్త కోడలు

ఎవడో అటు పరుగెడుతున్నాడు. చూసేరు. తరిమారు. పట్టుకున్నారు. దొరికిన వాడు నిర్భయంగా నిజం చెప్పేడు:

"యెంకటమ్మనుకుని వాటేసుకున్నా. తప్పే!"

తప్పనేస్తే, తగువాగుతుందా? నిజానికి తప్పన్నాకే, తగువు మొదలవుతుంది. కొత్తూరి వారి కొత్త కోడలు మానం, మర్యాదా మాట?

రుద్రయ్య దగ్గరకి తగువు రానే వచ్చింది. అంతా విన్నాడు. ఆలోచించాడు. అభిప్రాయం చెప్పేశాడు. అభిప్రాయం చెప్పేడంటే, తీర్పు యిచ్చినట్లే! దానికి తిరుగులేదు.

"ఎదవ! ఎదవపని సేశాడు. ఎంత సీకటయితే మాత్తరం, సూసుకోక్కర్లేదేటి? అయినా, అయినింటి కోడళ్లు సందలడ్డా, యీదుల్లో సికార్లేటీ? ఈ ఎదవ ఈదంట ఎడుతూంటే. అదే పనిగా సూడ్డంట! అది తప్పుగాదూ? అందుగ్గానీ పారబడ్డాడేవో? లేకపోతే ఎవరి కొంగూ పట్టుకోని ఈ సచ్చినోడు ఆ యమ్మ నట్టుకున్నాడంటే, సిత్తరంగానే వుంది!"

జూరీ సభ్యులు తలకాయలు ఊపేరు!

రుద్రయ్య వేలు విడిచిన మేనమామ కూతుర్ని మొగుడు విదిలేశాడు. పుట్టింటి కొచ్చేసింది. ఆ మొగుణ్ణి సాధిద్దావని చూసేడు రుద్రయ్య! వాడు పోలీసు ఉద్యోగి. "గుండెట్టి కొట్టేసి, తిరుగుబాటులో కాల్చాల్సి వచ్చి, కాల్చేశా!" నంటాన్నాడు. గుండు తడిమి చూసుకుని, వచ్చేశాడు రుద్రయ్య.

చిట్టెమ్మ చేత చిల్లర కొట్టు పెట్టించాడు, పొట్ట పోసుకుందుకు! కడుపు కోసం కొట్టు పెట్టుకుందుకు చిట్టెమ్మ ముందు వెట్టుసరి చేసింది.

"మనం చేసే అన్ని పనులూ కడుపుకోసవేఁ!" తప్పు లేదని, రుద్రయ్య ధైర్యం చెప్పేక, ఒప్పేసుకుంది!

కొట్టు పెట్టేక, అందరూ వస్తారు. ఆడ-మగ, పిల్లా పెద్దా, మెతక-ముసలి - ఎవరి అవసరం వారిది కదా?

అలాగే సత్తెప్ప సిగిరెట్ల కోసం వస్తాడు. వచ్చినప్పుడల్లా, పెట్టెడు సిగరెట్లు కొంటాడు. కొన్నవన్ని చిట్టెమ్మ ఎదురుగుండానే, కబుర్లు చెబుతూ కాల్చేస్తాడు.

సిగరెట్లు కొనుక్కుందుకు కావలసిన డబ్బూ, వాటిని తీరుబడిగా కాల్చుకుందుకు కావలసినంత కాలం సత్తెప్పకి పుష్కలంగా వున్నాయి. లేనిదల్లా, ఆ రెంటినీ చక్కగా వినియోగించడానికి, కావలసిన తెలివి!

"తెలివి లేకపోతేనేం, డబ్బుంది చాలు, వయసుంది చాలు, మేం పిల్లనిస్తాం!" అంటే, "మేం పిల్లనిస్తాం" అంటూ మేకల్లా వచ్చేరు, ఆడపిల్లల తండ్రులు.

అందర్ని హడలు కొట్టేశాడు వెంకటప్పయ్య. ఆయన కట్నాలడగలేదు; కానుక లడగలేదు!

"వెయ్యి గడపలకి బొట్టెట్టి పిలుస్తాను, పెళ్లికి! గడపకి అయిదు గుర్ని చూసుకో! అయిదు వేల మంది వస్తారు పెళ్లికి! వీరందరికీ భోజనాలు పెట్టి సమర్థించి, పెళ్లి చెయ్యి! చాలు!" అన్నాడు.

అయిదు వేల మందికి అన్నం పెట్టగల అన్నదాత కాని, కన్యాదాత కాలేదు సత్తెప్పకి. అయిదు వేల మందికి

ఆకలి తిరితె తప్పు, తన ఆలి బాధ తీరేది కాదు! అంచేత అంత వరకూ అక్కడక్కడ చిరుతిరుగుళ్లు తిరిగి తన ఆలి బాధని తీర్చుకుంటున్నాడు సత్తెప్ప! వాటిని మీరు చెడుతిరుగుళ్లంటే, అనండి!

సమభావం వుంటే తప్ప, సద్భావం పుట్టదు. సత్తెప్ప – చిట్టెమ్మలకి ఒకరి మీద ఒకరికి సద్భావం కలిగింది.

నడుస్తున్న దాన్ని నడవనిస్తారా జనం? దొంగతనం. రంకుతనం ముగ్గిన పనసపండులా బయటపడిపోతాయి!

వాసన కొడుతున్నా వెంకటప్పయ్యలో ఏ చైతన్యం లేదు. రుద్రయ్యలో విపరీతమైన చైతన్యం వచ్చింది. తన చిన్న చెక్కని ఎవడో ఆక్రమించి, దున్నుకుంటే, బాధ పడ్డట్టు బాధ పడిపోయాడు. నలుగురిని కాపలా కాయించి – పట్టించాడు. తగువు! పరిష్కారానికి రుద్రయ్య దగ్గరకే వచ్చింది. అంతా విని, అభిప్రాయం చెప్పేశాడు.

“అయ్యాడెమ్మ! ఏం దురంతం? ఇంటో కూకున్న ఆడ కూతుర్ని అల్లరి పెట్టేయ్యడవే? తెగబలిసేడుస్తున్నాడు, యీ సత్తెప్ప! నా కొడుకు! మేకపోతులా ఒళ్లు బలిసిపోయింది గావాల, పొగరణిగిపోతుంది! ... నా కొడుక్కి ... తెగ్గొయ్యండి!”

రెండక్షరాల, లింగ భేద వచనాలను ప్రయోగించి (మీరు బూతులంటారు!) నలుగురూ నవ్వుతుండగా సెలవిచ్చేడు రుద్రయ్య.

తీర్పు అయిపోయింది!

ఎటుచూసినా

ప్రేమ్‌శిల

అర్థం లేని
ఆకారం లేని
ఆకాశం మీద
చెమటలు కక్కుతూ రొప్పుతున్న
మబ్బులు
కింద
సిగ్గుతో అలల్లో నక్కుతున్న సముద్రాలు
అటూ యిటూ
ఎటుచూసినా
గర్భందాల్చి మృతశిశువుల్ని
ఈనబోతున్న
చెత్తకుండీలు
వంపులన్నీ కుళ్ళి కంపుకొడుతున్న
వీధుల శరీరాలు
ఎటుచూసినా
శాపనారాల శాసనాలు మోస్తున్న
మానవ కళేబరాలు
దౌర్భాగ్యానికి మరిన్ని మెట్లుగా
మారుతున్న
సజీవ అస్థిపంజరాలు
ఎటుచూసినా –

కవిత్వ మొక నిర్విద్ర సాధన

సోమసుందర్

వర్తమాన సాహితీ విపణిలో కవిత్వానికున్నంత నిరాదరణ మరే ప్రక్రియ కూ లేదు. కవిగా బ్రతకదలచిన వాడు నిర్ధనుడైతే దాదాపు యాచకుడుగా బ్రతక వలసి వస్తోంది. అటు సినీమా ప్రాపకమో, ఇటు అధికారుల ఆదరణో లభించిన అదృష్టశాలి సంగతి వేరు ... ఇతరత్రా ఏ కవికీ, అతడు ప్రజల్లో ఎంత ప్రఖ్యాతుడైనా ఆర్థికంగా చలామణీ ఏర్పడ్డం లేదు.

ధారావాహిక నవలలకూ వారపత్రికల కథలకూ ఉన్నంత డిమాండ్ కవిత్వానికి ఎప్పటికైనా వస్తుందని మనం ఆశించక్కర్లేదు. దీనికి సమాంతరంగానే కవులకు ప్రచురణకర్తల కనీస ఆదరణ లభించడమూ లేదు. కవి తానుగా అష్ట కష్టాలకూ లోనై తన కవితా సంపుటిని ప్రచురించు కున్నాడో – తొలి ముద్రణ అమ్మడానికే కనీసం ఒక దశాబ్ది కాలం పడుతోంది. ఇదైనా ప్రముఖ కవుల గ్రంథాలకు పట్టే అదృష్టమే! తక్కుంగల వారల సంగతి చెప్పనే అక్కర్లేదు.

బాహ్య పరిస్థితులు కవితకు ఇంత వ్యతిరేకంగా ఉన్నా, యువకులు మాత్రం అంతరిక సృజనా వ్యాపారంలో కవిత వైపుకే చప్పున ఆకర్షితు లౌతున్నారు. ప్రాథమికంగా సాహిత్యాభిమానం ఉన్న ప్రతి ఒకడూ అంతో ఇంతో కవితా రచనకు ఉపక్రమిస్తూనే ఉన్నాడు. ఏదో ఒక పత్రికలో తన కవితలను అచ్చు వేస్తూనే ఉన్నాడు. భారతి వంటి ప్రథమ శ్రేణి పత్రికలోనే ఆదరణ లభించిందా – అట్టి యువకుడు కవితా రథా రూఢుడైనట్లే తృప్తిపడుతున్నాడు.

వ్యాపారరీత్యా యింతగా నిస్తబ్ధమైవున్న కవిత్వం – యువ హృదయాలను మాత్రం ప్రథమశ్రేణి సాహిత్య కళగా ఆకర్షణ కలిగిస్తోంది. దీనికి కారణం – సూక్ష్మంలో మోక్షమన్నట్లు కొద్ది శ్రమతో గొప్పకీర్తి సోపానాన్ని అధిరోహించాలనే దురాశ మాత్రమేననడానికి తార్కాణాలు కానరావు.

కవిత్వానికి ఆకర్షితు లౌతున్న యువకులు ప్రధానంగా కవిత్వ పాఠకులు; వారికి తమకు పూర్వం పుట్టి కీర్తిమంతులౌతున్న కవులందరి రచనల పట్ల మక్కువ మిక్కుటంగా ఉంది. వారా కవిత్వాన్నంతా చదువుతున్నారు. కొద్ది మందయినా అధ్యయనమూ చేస్తున్నారు. మరికొందరు విద్యావంతులు ఆంగ్ల భాష ద్వారా ఇతర దేశాల కవులను పరిచయం చేసుకొంటున్నారు. అలాంటి వారికి తమ హృదయాలలో మరుగుతూన్న భావపరంపర – అభివ్యక్తికోసం తహతహ లాడుతుంది. ఒత్తిడి కల్గిస్తుంది. తమదైన గొంతు విప్పి తమ భావాలకు కవితా స్వరూప మిచ్చి వెలువరుస్తున్నారు. ఈ ప్రయత్నంలో కొందరు విజయమూ సాధిస్తున్నారు.

ఇలాంటి యువకులకు భాషా పాటవం లేకపోవచ్చు, సంవిధాన చాతుర్యం అలవడక పోవచ్చు; శిల్ప విజ్ఞానమూ స్వాధీనం కాకపోవచ్చు;

కాని వారిలో కవితా భావుకత్వం మాత్రం పుష్కలంగా ఉంది. రసమయ కవితా హృదయమూ ఉంది.

అలాంటి యువకులు సావధాన చిత్తంతో ప్రతి అభివ్యక్తిని నిశితంగా తీర్చి దిద్దుకో గలిగితే, తమ కవితా భావ శకలాలు చదువరి గుండెలకు గుచ్చుకొని నిలవగలిగే పదును అలవర్చుకో గలుగుతారు. ఈ నైశిత్యం ఎలా లభిస్తుంది? ఒక కవితను పూర్తిచేసేమని చప్పున తృప్తి పడకుండా, చెప్పబడిన రీతికంటే మరింత రమణీయంగా తీర్చి దిద్దడానికి అవకాశముందేమో అధ్యయన బుద్ధితో పరిశీలించుకోవాలి. సంవిధానం విషయంలో కాని భావాభివ్యక్తి విషయంలోకాని మరిన్ని మెరుగులు సంతరించుకోగల పరాత్మక పరీక్షకు పూనుకోవాలి. ఈ ధ్యాన మగ్నతను ప్రతి యువ కవీ మొదటినుంచీ అలవర్చుకోవలసి ఉంది. ఇలాంటి ఓరిమి కొరవడినపుడే ఒకడు ఎన్ని కవితలు వ్రాసినా పాఠకుల హృదయంలో ముద్ర వేయలేక పోతాడు.

ఈ పరిశీలనా ధ్యేయం ఉన్న యువకులు వ్రాసే ప్రతి కవితా రమణీయ రేఖలతో తీర్చిదిద్దబడుతుంది. సహజాతంగా వారిలో వికసిస్తున్న ప్రతిభకు దీటుగా సృజన పెంపెస లారుతుంది ప్రతిభను నిత్య హరితంగా రక్షించేది వ్యుత్పన్నత. ఇది లోకవృత్త పరిశీలనం వల్లా, గ్రంథ అధ్యయనం వల్లా, అనుభవ పరిపాకంలో ఆలోచనలను జీర్ణించుకోవడం వల్లా - ఏర్పడుతుంది. ఇలాంటి వ్యుత్పన్నతను ఆరంభం నుంచీ యువకులు అలవర్చుకుంటూ తమ్ముతాము నిర్మించుకోవాలి. భావుకత్వంతో పాటు, పరిశీలనా బుద్ధిని కేంద్రీకరించుకోవాలి.

ఒక కవితా రచన పూర్తి కాగానే నిర్దష్ట స్వరూపం సిద్ధించినట్లు తృప్తిపడే రచయిత తనకు తానే హాని చేసుకుంటాడు. రాయడం ముగిసిన మరు క్షణంలో ఏదో ఒక పత్రికకు అర్జంటుగా పంపి కీర్తి పొందాలని ఉబలాట పడేవాడు - వ్యతిరేక ఫలితాన్నే పొందుతాడు. తాను రచించిన ప్రతి రచనను మరింత సుందరంగా మరింత తీక్షణంగా రూపొందించడ మెలా అనే తపన ఆ రచయిత హృదయాన్ని విడువకూడదు. రాయబడిన రీతిలో అభివ్యక్త మయిన సంవిధానంలో ఆ రచనకు పరిపూర్ణత్వం లభించిందా లేదా అన్న నిశిత పరీక్షకు తానుగా పూనుకోవాలి. అంటే సృజనాత్మక చర్య పూర్తి కాగానే ఆ రచయిత విమర్శకుడుగా పునరవతరించి, తన రచనను తానే పరీక్షించు కోవాలన్న మాట.

ఒక భావ శకలం ఒకని హృదయంలో స్ఫురించింది; దాన్ని కవితగా మలచాలన్న తీవ్ర కాంక్ష ఉత్పన్న మైంది; అయితే దానిని పరిపూర్ణ చిత్కళగా తీర్చి దిద్దగలగడానికి కేవలం కలమూ కాగితమూ సరిపోదు. ఆ సృజనకు పూర్వ రంగంలో అభ్యాసము, ధారణ, అంతర్దర్శనము స్థిరపడి ఉండాలి. రచయితకు 'లోచూపు' తో పాటు గురజాడ మహాకవి చెప్పినట్లు - 'చుట్టు చూపు' కూడా ఏర్పడితే తప్ప అతని గవేషణ పూర్తిగాదు. ప్రథమ రచనలో రూపొందిన స్వరూపమే పరిపూర్ణ కళామయ స్వరూపమనుకునే తృప్తి ఏర్పడిన వాడు అన్వేషి కాలేడు. ప్రతి కవితా అనితరసాధ్యమనిపించేటట్లుగా తీవ్ర పరిశీలనలో తనకు సాక్షాత్కరించడం వేరు ... పాఠకునిగా తనకే విమర్శనాత్మక పరిశీలనలో

సైతం అలరించిన రచన ఇతర సహృదయుల్నీ తప్పక రంజింప చేస్తుంది. ఆ స్థాయి నందుకుందుకు ప్రతి రచనలోనూ ఒక విశిష్ట సంవిధాన స్ఫూర్తి భాసించాలి. తొందర పడి ప్రచురింప చేసుకుందుకు ఆరాటపడే వారికి ఇది లభించదు.

ఒక కవితను ఎన్నిసార్లు మార్చి సంస్కరిస్తే అంత ఉత్తమస్థాయి నందుకో గలుగుతుంది. ఒక కవి పరిపూర్ణత్వం (Perfection) పొందడానికి ఇదే కీలక మైన రహస్యం. అన్యత్రా దగ్గర దారులు లభించవు.

ఒక రచయిత వద్ద - ఏదో పత్రికలో ఏదో రీతి అచ్చుపడి పోగుపడి ఉన్న కవితల స్టాకును ఏదో విధంగా గ్రంధస్థం చేసి విడుదల చెయ్యాలనే వెర్రి తొందర కూడా కవిగా ఏ ఒకనికీ శ్రేయోదాయకము గాదు. ఆ వేగమే ప్రధానమైతే వెనుక ముందులు చూసుకోనీయదు. మంచి చెడ్డల వేర్పాటుకు అవకాశ ముండదు. అలా వెలువడిన గ్రంథం తనకుతానుగా అన్యాయం చేసుకోవడంతో బాటు, మొత్తం కవిత్వానికే ఎంతో కొంత అన్యాయం చేస్తుంది. అంటే ప్రతి కవి తన రచనలలో మేలు కీళ్ళ బేరీజు నిస్సంకోచంగా చూసుకోవాలి. స్థాయి తక్కువ రచనలను ఓర్పుతో పరిహరించుకోవడం కవిగా అతని అస్తిత్వాన్ని పెంపొందిస్తుంది.

మనసులో ఒక భావ శకలమో, ఒక పద చిత్రమో, ఒక శబ్ద చమ త్కారమో తళుక్కుమనే సరికి ఒక కవిత రాయాలని కోరిక కలగడం సహజమే. కాని ధారణలో అది పరిపూర్ణం కాకపోతే, ఆ కవిత పునరుక్తులతో నిండుతుంది. అలాంటిది పఠిత హృదయంలో పూరా విప్పారకుండానే రాలి పోతుంది. ఆ కవితను పఠించడానికి పట్టిన కాల పరిమితి పాటైనా పాఠక హృద యావాసం చేయలేక పోతుంది. అట్టిది కవితగా అపజయం పొందినట్లే. అందుకే ప్రతి కవీ తన కవితను ఇలాంటి అపజయాల నుంచి పరిరక్షించు కొందుకు జాగృత హృదయంతో పునర్నిర్మించు కోవాలి. కాలక్రమేణా ఒక కవితలోని బలా బలాలు ఆ కవికే తేటతెల్లమవుతాయి. ఆలాంటప్పుడు ఆత్మ వంచనా మేఘాలను దూరం చేసుకొని, నిశిత బుద్ధితో శస్త్ర చికిత్స చేసుకోవాలి. అట్టి దర్శన వీక్ష కలగాలంటే ప్రతి కవి ఉత్తమ కవితా వ్యుత్పన్నుడై విమర్శక దృష్టిని అలవర్చు కోవాలి. అహంకార మమకారాలకు తావులేకుండా తనకు తానుగా పరస్థలాలు చెక్కేసు కోవాలి. అలాంటి పునః పునః పరిశీలనలోనే ఒక కవిత స్వచ్ఛ రూపాన్ని సంతరించుకొంటుంది.

ఈ పరామర్శ ప్రతి కవికీ తన జయాపజయాల విషయంలో అత్యవసరం. ఈ అత్యవసర సాధనను ప్రతి కవీ నిర్నిద్ర హృదయంతో కొనసాగించాలి. ఈ రహస్యం తెలుసుకోకపోవడం వల్లనే, చాలా మంది రచనలు ఉత్తమ కవితలు కావలసినవి కూడా ఉత్తనే నీరు కారి పోతున్నాయి.

"తన లోపాల్ని గుర్తించడానికీ, వాటిని తొలగించ పూనుకోడానికీ మనిషికి ధైర్య సాహసా లుండాలి."

– జోసెఫ్ స్టాలిన్.

సిందూరం

కె. పద్మారావు

నా కవితా సిందూరంతో
నెత్తురు మండిస్తాను
నా కవితా సంధ్యారాగంతో
దైన్య జీవన తిమిరచ్ఛటలు హరిస్తాను

నిజమే
కవి భజంత్రీలు
భజనలకు
పద సంపదంతా
తగలేస్తున్నారు
ఉద్యమాలు నడిపించా
ల్సిన శక్తితో
ఉన్మాదుల్ని పొగిడేస్తున్నారు
జీవితాన్వేషణలో జీవనఘర్షణలో
నెత్తురు వేడెక్కి వాడిగా
దూసుకు పోవాల్సిన కవి
చిత్తుగా త్రాగిన తిక్కలో
చీకటి పోగేసుకుంటున్నాడు
కూలికి విషం త్రాగుతున్నాడు
కిరాయికి నరహత్యలు చేస్తున్నాడు
దోపిడి నెదిరించి
అవినీతిని అణగించి
ఆశయాన్నుద్దీపించి
సమకాలీన ప్రజా
జీవితాల కద్దాలు పట్టాల్సిన కవి
రసస్ఫూర్తిగాలేని
రసస్యంది కాని
అశ్లీల శృంగారాన్ని
అర్థాని కాశించి
స్వార్థంతో
యువత జీవితాలపై
రుద్దుతున్నాడు

అయినా ఓ కవీ!
పట్టెడు మెతుకులు దొరకని కడుపును
గుప్పెడు డబ్బుల కమ్ముడు పోయి
ఎలా చిత్రించ గలవు ?

అందుకే !
జాతి నైతిక శక్తిని హరించే
పడుపు వృత్తిని
నిరసించ గలిగిన వ్యక్తిత్వం
నల్లబారిన నీ నెత్తురులో లేనినాడు
జాతిమనుగడను శాసించాల్సిన నీవే
పతనమైన నాడు
ప్రజకు జవం జీవం పూన్చి
ప్రగతి పథంలో
"కదంతాల్" త్రొక్కించాల్సిన నీవు
అధోగతి పాలై
నల్ల బజారులో తారాడు నాడు
జాతికి మనుగడేది ?

అందుకే ఓ కవీ!
నీవు వెలుగును చూడాలి
నీ ఆవేశంతో
జాతిలో నెత్తురు పొంగించాలి
నీ భావుకతతో
ప్రజాశక్తిని పండించాలి
నీ నిర్భీకతతో
దైన్య జీవన విముక్తిని చాటించాలి
నీ ఔన్నత్యంతో
కుటిల మతాతీత సమాజ
నిర్మాణాన్నాశించాలి
కుటిల సంస్కార విషవృక్షాలను
ఖండించాలి
అప్పుడే
కవితా లోకంలో అభ్యుదయం
అభ్యుదయంలో సిందూరం

అందుకే
నా కవితా సిందూరంతో
నెత్తురు మండిస్తాను
నా కవితా సంధ్యారాగంతో
దైన్యజీవన తిమిరచ్ఛటలు హరిస్తాన

కథానిక కన్నడం

శవం, జనం

హెచ్. ఎస్. వేంకటేశ మూర్తి

అనువాదం :

ఘట్టమరాజు అశ్వత్థనారాయణ

ఓ చింపిరి గడ్డం చిత్రకారుడు, మొదట్లో లాల్ బాగ్‌లోని గుల్ మొహర్ మొదలగు దృశ్యాలు చిత్రించే వాడు, ఉన్నట్లుండి పూర్తిగా మారిపో యాడు. అతని కళ్ళల్లో చెప్పలేని వ్యథ, క్రోధం గూడుకట్టు కొన్నాయి. అతని గడ్డం పొడుగ్గా పెరగసాగింది. నా చుట్టూవున్న ప్రజల బాధ నాకళకు వస్తువు కావాలి అని నిశ్చయించు కొన్నాడు.

సూర్యుడు నడినెత్తిమీద నిప్పులు కురిపిస్తున్నప్పుడు చిత్రకారుడు సిటీ మార్కెట్టు వద్దకు వచ్చాడు. సినిమా ప్రారంభమయ్యే సమయం. సినిమా హాలు గేటు దగ్గర బ్రహ్మాండమైన పోస్టరు – కాళ్ళు పంగచాపి నిల్చున్న నర్తకి, రేడియం లాగా ఉజ్జ్వలంగా పకాశిస్తున్న పచ్చటి కళ్ళు. విపరీత మైన రద్దీ, అరుపులు, మాటలు, ,కచే గలాటా. ఎవరో తరుము న్నట్లుగా పరుగులు.

గుంపుమధ్య జొరబడి సినిమా హాలు వెనుకవైపు గేటువద్ద వున్న ...న్న గుడి దగ్గరకు వచ్చాడు చిత్ర ...రుడు. ఆ రోడ్డుగుండా పోతున్న ...నులు గుడిముందు ఓ క్షణం ఆగి, ...గిపోతున్నారు. గుడిలోపల వున్నది దేవుడో, దేవతో చిత్రకారునికి తెలియ లేదు.

దేవాలయం ఎదురుగా, పాడుబడిన కోట ప్రక్కన పంచెలో చుట్టబడిన ఓ శవం కనిపించింది. ఆ శవం మీద ఎండ నిప్పులు చెరుగుతూంది. ఆ శవం కాళ్ళు మాత్రం గాలికి బయటికి కనిపి స్తున్నాయి. చిత్రకారుడు స్తబ్ధుడై నిల్చుండి పోయాడు.

శవం కాళ్ల దగ్గర ఓ స్త్రీ కూర్చొని వుంది. ఏడ్చి ఏడ్చి ఆమె కళ్లు ఎర్ర బారాయి, ఉబ్బినాయి. ప్రాయంలోని కుదురైన స్త్రీ. ఆమె వొడిలో ఏడుస్తున్న పసిబిడ్డ. ఎడమ తొడను ఉయ్యాల లాగ ఆడిస్తూ, బిడ్డను నిద్రపుచ్చేందుకై ప్రయత్నించింది. పసిబిడ్డ మరింత గట్టిగా ఏడ్వసాగింది. ఆమె బిడ్డకు స్తన్యమిచ్చింది. బిడ్డ ఏడ్వడం మానింది.

ప్రజలు శవం ప్రక్కనే నడిచి పోతున్నారు. కొందరు ఓ క్షణం ఆగి, చూసి ముందుకు పోయారు. విషా దంగా, అనుమానంగా, భయం భయంగా. చిత్రకారుడు –ఓ చెట్టు క్రింద కూర్చొని పేపరు మీద కొన్ని గీతలు గీయసాగాడు. మధ్య మధ్య తల ఎత్తుతూ, దించుతూ కొద్దిసేపట్లో తన పనిలో లీనమైపోయాడు.

షో ప్రారంభమయ్యే సమయం. గుడి గంటల మోత ఎక్కువ కాసాగింది. దంపతులు గబగబా అడుగేసి వస్తున్నారు. ఐదారేళ్ళ బిడ్డ కూడా నడుస్తున్నది. శవం దగ్గరకు వచ్చే సరికి "మమ్మీ అదేంటి?" అని అడిగింది. "దాన్ని చూడొద్దు" అని తల్లి బిడ్డకు ఇంగ్లీషులో చెప్పింది. ఆ స్త్రీ "శవాన్ని పూడ్చి పెట్టడానికి ధర్మం చెయ్యితల్లీ" అని

అడిగింది. ఆ దంపతులు తమ బిడ్డకళ్లు మూసి, గబగబా సాగిపోయారు. కొంచెందూరంలో ఎదురైన పోలీసుకు శవం గురించి చెప్పి, ముఖమంతా అదోలా పెట్టాడు.

యూనిఫారంలో వున్న పోలీసులాఠీ ఊపుకొంటూ, టక టక మని బూట్లు చప్పుడు చేస్తూ శవం దగ్గరకు వచ్చాడు. "సామీ, శవం పూడ్చి పెట్టేందుకు ధర్మం చెయ్యండి" అని ఆ స్త్రీ దీనంగా వేడుకొంది. పోలీసు ఆమెవైపు గుర్రుమంటూ చూశాడు. మరుక్షణంలో పోలీసు నోటికి వచ్చిన తిట్లన్నీ తిట్టాడు. శవం అట శవం? శవం ఎక్కడుందే? అని గద్దించాడు.

'పొద్దున్నే ప్రాణం పోయిందిసామీ? అంది ఆమె.

'ఓహో! అయితే సాయింకాలం మళ్ళీ ప్రాణంవస్తుందా?' అని పళ్ళికిలించాడు. బూటు కాలితో శవాన్ని దొర్లించి 'లెయ్‌రా గాడిదకొడకా!' అని గదమాయించాడు. శవం రెండు మార్లు పొర్లి బోర్లపడి అచేతనంగా వుండి పోయింది. స్త్రీ గట్టిగా ఏడువసాగింది. సినిమా టికెట్ దొరకని ప్రజలు చుట్టూ మూగారు. పసిబిడ్డ చన్ను కుడుస్తూ అలానే నిద్రపోయింది.

'నిజంగా చచ్చిపోయుంటాడు. చావ లేదని ఎలా అంటాము?' గుంపులోంచి ఎవరో అన్నారు. ఎవరన్నా రీమాటలు అని పోలీసు వెనుకకు తిరిగి చూస్తే, ఎవరూ మాట్లాడలేదు.

"నో - నో ...... బతికెందుకు ఇదీ ఒక మార్గం" - నీట్‌గా డ్రెస్ చేసుకొని, గాగుల్స్ ధరించిన ఓ పెద్దమనిషి అన్నాడు.

"ఓ మైగాడ్! ఇలాంటివారు ఉంటారా?" దీర్ఘాలు తీస్తూ ఓ సుందరాంగి తన స్నేహితురాలి భుజాల మీదుగా ఇంతింత కళ్ళతో చూడసాగింది. రోడ్డు మీద పొయ్యే వారందరు శవం చుట్టూ మూగారు. కొందరు తమ కార్లను, స్కూటర్లను నిలిపి, వచ్చి ఠీవిగా "వ్వాట్? అక్సిడెంట్?" అని అడిగారు. రోడ్డు జామ్ అయి వెనుక నిలిచిన కార్లు, బస్సులు, లారీలు, స్కూటర్ల హారన్లతో మార్మోగ సాగింది.

ఇంతలో గుంపులో చిక్కుకుపోయిన పోలీసుకు చెమటలు పోశాయి. "పొండి. ఏం కోతులాడు తున్నాయా? వెళ్ళిపొండి" అని కేకలు వేయసాగాడు. అతని మాటలు వినే కుతూహలంతో మరి కొంత మంది గుంపులోకి చేరారు. చెమటోడుస్తూ, విచిత్రంగా కనబడే పోలీసునే అందరూ చూస్తున్నారు. ఇంతలో విజిల్సు ఊదుకుంటూ పోలీసులు వచ్చారు. హా హూ అంటూ కేకలు వేస్తూ గుంపును చెదర కొట్టారు.

గుంపు చెదిరిపోయిన తర్వాత హెడ్ కానిస్టేబుల్ మాత్రం వుండి 'ఏమిటి నీ కథ' అని ఆమెను అడిగాడు. పసిబిడ్డ మేల్కొని, నోటినుంచి స్తన్యం జారగా, బిగ్గరగా ఏడ్వసాగింది. ఆ స్త్రీ తన తొడపై బిడ్డను ఆడిస్తూ "నా మొగుని శవం అన్నా, పూడ్చేందుకు డబ్బుల్లేవు" అంటూ కంట నీరెట్టింది. హెడ్డు పాలుతాగుతున్న బిడ్డవైపొక సారి, శవం ప్రక్కన పడివున్న చిల్లర నాణాల వైపొకసారి చూశాడు. వానికి ఏమి తోచిందో ఏమో, 'ఎలాగైనా పొడయిపో' అని అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

శవంమీద కోట గోడల నీడలు వ్యాపించాయి. చిత్రకారుని గీతలకు

అర్థకల్పన జరుగసాగింది. ఎంతో ప్రయత్నించి చిత్రకారుడు ఆమె ముఖం పైపచ్చని నరాలని తీర్చాడు. చెంపల మీద ముత్యపు బొట్టును దిద్ది దానిలో వెలుతురి ప్రతిబింబాన్ని ప్రతిఫలింప చేయాలని ఆరాట పడ్డాడు. చిత్రంలో కూడ శవం నిశ్చలంగా వుంది. ఆమె ఏడుస్తూ వుంది. బిడ్డ పాలు తాగుతూ వుంది.

పొద్దు గూకింది. ఆట వదిలారు. ఆట ప్రారంభ మయింది. పూజారి దేవుని కళ్ళను పీకి, సంచిలో వేసి వుంచిన మంగళారతి పళ్ళెంలోని చిల్లర పైసల ను తీసి ఎంచుకొని జేబులో భద్రపరుచు కొన్నాడు. ఓమారు శవాన్ని, మరో మారు స్త్రీని చూసి గుడి తలుపులు మూశాడు.

రెండో సినిమా మొదలయిన తర్వాత జనసంచారం తగ్గింది. చిత్ర కారుడు తనపని ముగించి, చెట్టుకు ఆనుకొని 'అబ్బా' అంటూ వొళ్లు విరి చాడు.

చిన్నగా తుంపర మొదలైంది. శవం అచేతనంగా పడివుంది. మధ్యా హ్నం అగపడిన పోలీసు వచ్చాడు. బీడీ తాగుతున్నాడు. ఈ 'శవాన్ని ఎత్తేస్తావా లేదా కటకటాలలోకి పోతావా' అని గద్దించాడు. 'సామీ శవాన్ని పూడ్చిపెట్టాలి' అని మును పటిలాగే అంది. 'పొద్దున్నించి ఎంత డబ్బు కూడేశావు?'

'నిజంగా బాబూ .... దేవుని సాక్షిగా లేదు బాబూ'

"అయితే చూద్దాం పద. చెక్ చేస్తాను. ఏమైనా మాట్లాడావో జైల్లో పడేయిస్తాను. జాగ్రత్త!' అని గదమా యించాడు. ఆ స్త్రీ లేచి అతన్ని అనుస రించింది.

బిడ్డ శవం పక్కనే నిద్రపోతూంది. కోట వెనుకకు ఆమె, అతడు వెళ్లిన తర్వాత ఏం జరిగిందో ఏమో బిడ్డకు గాని, శవానికి గాని తెలియలేదు.

వాన నిల్చిన తరువాత స్త్రీఒక్కతే శవం దగ్గరకు వచ్చింది. చిత్రాన్ని వానలో తడవనియ్య కూడదని చిత్ర కారుడు ముందే వెళ్లిపోయాడు. పోయే టప్పుడు చిత్రకారుడు ఆచిత్రానికి "ఎ బర్నింగ్ ప్రోబ్లం" అని పేరు పెడదా మను కొన్నాడు. బిడ్డను పొదివి కొని ఆమె చిల్లర డబ్బులు పోగుచేసుకొంది. అంగడిలో చౌకగా దొరికే బ్రెడ్డు కొను క్కొంది. శవాన్ని కోట వెనుకల వున్న చీకటిలోకి మెల్లగా సాగించింది. శవాన్ని కరుచుకొని, ప్రక్కనే పండుకొని బిగ్గరగా ఏడ్చింది.

నియంతా! నీకో ప్రశ్న

బొల్లిముంత నాగేశ్వరరావు

అధికారం దుస్తుల్లో
అహం పేట్రేగిన నియంతా!
నిన్నో ప్రశ్న అడుగుతున్నా చెప్పు –
మనిషి తయారుచేసిన
ఏ రెండు గడియారాలూ
ఒకే సారి ఒకే టైం చూపటంలేదు.
మరి మెదడున్న మనుషులంతా
అడుగులకు మడుగు లొత్తాలనే
అసహ్య కరమైన ఒకే భావంతో
నీ పాదాల దగ్గరపడి ఉండాలని
ఎలా కోరుకుంటావ్??
మెదడు లేని మిషన్ను
కంట్రోలు చేయలేవు –
మెదడున్న మనుషుల నెలా
కంట్రోలు చేస్తావ్!!

పా. ప. పట్ల నా అసంతృప్తి

సౌదుం రామ్మోహన్

పాలగుమ్మి పద్మరాజు గారు ఈ తరం వారికి సినిమా రచయితలు గా మాత్రమే తెలుసు. ముందు తరంవారికి కథా రచయితగానూ, కమ్యూనిస్టు వ్యతిరేక మేధావిగానూ తెలుసు.

పాలగుమ్మి పద్మరాజు కథలు ఎప్పుడో పిల్లప్పుడు చదవడమే కాని ఇటీవల చదవలేదు. ఇటీవల ఒక కథ మాత్రం చదివాను. ఆ కథ పేరు "పడవ ప్రయాణం."

ఆ కథ గురించి రెండు ముక్కలు చెప్పుకుందాం. 'పడవ ప్రయాణం, అన్న ఈకథ అధోలోక జీవుల (లంపెన్ ప్రోలి టేరియట్) జీవితాన్ని వర్ణించేది. ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే అధోలోకజీవుల దాంపత్య జీవనానికి సంబంధించింది ఈ కథ. సమాజంలోని ఎలాంటి ఉత్పత్తి కార్యక్రమంలో కానీ, సేవా కార్యక్రమంలో కానీ పాల్గొనకుండా జూదం, దొంగతనం, డబ్బుకోసం హత్యలు, పడుపు వృత్తి వగైరా పనులు చేసేవాళ్ళని అధోలోక జీవులంటారు. వీళ్ళు అలా బతకడానికి ప్రధానంగా సమాజమే కారణం –

'పద్దాలు' అనే తాగుబోతు, దొంగ వుంటాడు. దొంగతనమే వృత్తిగా గల దొంగ. అతను ఇద్దరు ఆడవాళ్లని 'ఏలుకుంటాడు.' అతనికి ఇద్దరు పెళ్ళాలంటే "అలాటి వాళ్లకి పెళ్ళాలేమిటి? వుంచుకున్న వాళ్ళు అనండి" అంటారు మన మధ్యతరగతి జీవులు

మన మధ్యతరగతి జీవుల దాంపత్య జీవన నైతిక సూత్రాలకీ, అధోలోక జీవుల దాంపత్య జీవన నైతిక సూత్రాలకు మౌలికమైన తేడావుంది. ఆ తేడాకు ప్రధాన కారణం వాళ్ళ జీవన పరిస్థితులే.

'పద్దాలు' వృత్తి దొంగ. గోదావరి నదిలో పడవల మీద రవాణా చేస్తున్న సరుకులను దొంగలిస్తుంటాడు పద్దాలు. ఆ దొంగతనంలో 'రంగి' అనే ఒక అమ్మాయి అతనికి సహకరిస్తుంది. 'రంగి' అతని పెళ్ళాంకాదు. కానీ అతని తోనే కలిసి బతుకుతూంటుంది. 'నీకు పెళ్ళి అవలేదా?' అంటే రంగి ఇలా జవాబిస్తుంది.

"లేదు. సిన్నతనంలోనే పద్దాలు నన్ను లెగేసుకొచ్చాడు. అప్పుడు తాగుతాడని నాకు తెలవదు.... ఇప్పుడు నేనూ తాగుతా ననుకోండి. తాగితే తప్పులేదు; తాగి సావ కొడతాడు." మరి "వదిలి వెళ్ళలేక పోయావా?" అంటే ఇలా అంటుంది.

"తన్నులు తిన్నప్పుడు అలా అని పిస్తది. అయినా అంతటి మనిషి లేడండి. మీ రెరగరు. ఉత్తప్పుడండీ యెన్నలా కరిగిపోతాడు. వొందమందితో పోయినా సరే అడు నాకాడి కొచ్చి తీరతాడు. నేను లేకపోకే గుండె పగిలి సచ్చిపోడూ?"

రచయిత అన్నట్లు వాళ్ళిద్దరి మధ్య వున్న అనుబంధం చూస్తే ఆశ్చర్య మవుతుంది. పద్దాలు దొంగతనం చేసేదికూడా రంగి కోసం కాదు.

తాజాగా లేపుకొచ్చిన మరో "గుంట" కోసమే. ఈ విషయాన్ని 'రంగి' ఇలా చెపుంది.

"ఈ సొమ్మంతా మళ్ళీ ఆ గుంటకే దక్కుడు. దాని మీద మోజు పదిలేదాకా దాన్నొదలడు. నేను ఈ కట్టాలన్నీని. దొంగనెంజ! నా ఉసురోసు కుంటుంది."

రంగిని చూస్తే తాను ప్రేమించిన వ్యక్తికోసం ఆత్మత్యాగం చేసిన 'సిడ్నీ' (రెండు మహానగరాలు) గుర్తొస్తాడు.

'పడవప్రయాణం' కథలో 'రంగి గురించి రచయిత ఇలా అంటాడు.' "తన మగవాడి కోసం ఆమె నిరంతరం తపిస్తుంది. కానీ అతడు నిర్దుష్టంగా, నీతిగా నడుచుకోవాలని ఆమెకు పట్టింపు లేదు. అతని సుగుణాలతో అవగుణాలతో అతన్ని ఆమె అంగీకరించింది."

అధోలోక జీవుల శృంగారమే గొప్పదని. వాళ్ళదాంపత్య జీవనమే ఆదర్శమని నేను చెప్పలేను. కాకపోతే వాళ్ళ జీవితాలని ఇంత లోతుగా తెరచి చూసి వాళ్ళ జీవితాలకు కళాత్మక రూపం ఇవ్వడం ప్రశంసనీయ మంటాను. అయితే పాలగుమ్మి పద్మరాజు గారి పైన నాకొక అసంతృప్తి వుంది.

అధోలోక జీవులు ఇలా దొంగతనం చేయడం, అందరితో కొట్టించుకోవడం, తిట్టించుకోవడం మంచిపని అనిఎవ్వడూ అనడు. పోతే వాళ్ళు అంటే అధోలోక జీవులు అనే ఒక 'పార' సమాజంలో పుట్టడానికి ప్రధాన కారణం సామాజిక పరిస్థితులే. ఈఅవగాహనతో ఆయన ఈ కథ రాయలేక పోయాడే అన్నదే నా బాధ. నిరుద్యోగం తాండవమాడే పెట్టుబడిదారి సమాజంలో, విపరీతమైన ఆర్థిక వ్యత్యాసాలున్న వర్గ సమాజంలో అధోలోక జీవుల ఉనికి అనివార్యం. వాళ్ళు అలా వున్నందుకు వాళ్ళని తిట్టలేం. కానీ వాళ్ళని సృష్టిస్తున్న సమాజాన్నైనా నిరసించాలా? లేదా? ఇదిగో ఈ సమాజిక నిరసన లేనందుకే పా. ప. గారి పట్ల నాకు అసంతృప్తి. ఈ విధమైన సామాజిక నిరసనవ్యక్తం చేయాలంటే రచయితకు సామాజిక స్పృహ అవసరం.

"టెస్ట్ ట్యూబ్ బేబీ, టెల్ మి ది ఫాక్ట్!"

జయంపు కృష్ణ

పరీక్ష నాళికలో
ప్రాణం పోసుకున్న
ఓ!
టెస్ట్ ట్యూబ్ బేబీ,
టెల్ మి ది ఫాక్ట్!!
లాబొరెటరీలో పురుడు పోయాలని
'రేపటి మనిషి'ని డిజైన్ చేస్తున్న
ఈ తరం మేధావులు.....
డి. ఎన్. ఎ. ట్రాన్స్ క్రిప్షన్‌లో
హెలికల్ స్ట్రక్చర్ ట్రాన్స్ క్రియేషన్‌లో
అమినో యాసిడ్స్ అమరికలోనూ
'మతం మందు' నూరి పోస్తున్నారా?
'కులం క్లోరోఫాం' లో
ముంచుతున్నారా??
కృత్రిమంగా తయారవుతున్న
నువ్వు
కల్తీకి, కాలుష్యానికి,
కుహనా సంస్కారానికి ప్రతీకవా?
సహజంగా
స్వేచ్ఛా వాయువుల్ని పీల్చే
మానవతా వాదానికి
ప్రతినిధివా??
టెస్ట్ ట్యూబ్ బేబీ!
టెల్ మి ది ఫాక్ట్!!

అనుకున్నాడు

మల్లాది వెంకటకృష్ణ మూర్తి

మహేష్ తను చేయబోయే ఉద్యోగం గురించి చాలా అనుకున్నాడు. మొట్టమొదట, ఇళ్ళు కాలుతుంటే ఎర్రరంగు ఫైరింజన్ కారులో వచ్చి ఇళ్ళని ఆర్పే వుద్యోగులని చూసి అలాంటి ఉద్యోగి అవాలనుకున్నాడు, తన ఎనిమిదేళ్ళప్పుడు.

స్కూల్ నుంచి తిరిగి వస్తూంటే, కొన్ని గుడిసెలు అంటుకొని మండుతూండటం గమనించి ఆగిపోయాడు. గందరగోళం. హడావిడి. అరుపులు. గోల.

హఠాత్తుగా గణగణ గంట మ్రోగించుకొంటూ వచ్చిందో ఫైరింజన్. దాంట్లోంచి కాకీ రంగులో ఉన్న మనుషులు కింద కురికి గొట్టాలతో నీళ్ళని చిమ్ముతూ అగ్నిని ఎదుర్కొన్నారు.

వాళ్ళరాక, వాళ్ళ విజయం ఎంతో ఉత్సాహ పరిచాయి మహేష్‌ని. ఇళ్ళలో వాళ్ళు, వాళ్ళకి సంతోషంతో తమ కృతజ్ఞతలు తెల్పుకుంటూంటే, 'పెద్దయితే నేను ఫైర్ ఇంజన్ డిపార్ట్ మెంట్‌లో చేరతాను'' అనుకున్నాడు.

ఇండియా. చైనాల మధ్య యుద్ధం వచ్చింది. రోజూ పేపర్ల నిండా భారత సైనికులు యుద్ధ రంగంలో ప్రదర్శించే సాహస కృత్యాలు కనపడుతుండేవి. అప్పుడు అనుకున్నాడు, - పద్నాలుగో ఏట. పెద్దయ్యాక సైనికుడిగా ఉద్యోగం సంపాదించాలని.

పరీక్షలయాక, పెద్దమ్మ వాళ్ళ ఊరు వెళ్ళాడు, తండ్రితో. రైలింజన్ దగ్గరే నిల్చున్నాడు, కుతూహలంగా చూస్తూ. రైలు బయలుదేరాక, అంత పెద్ద రైలుని, అన్ని వందల మంది ప్రయాణీకులని తీసుకు వెళ్ళే రైలింజన్ డ్రయివర్ ఉద్యోగం తనకు వస్తే బావుండును అనుకున్నాడు. తన పదహారో ఏట.

తమ ప్రక్కింట్లో కొత్తగా అద్దెకి వచ్చిన కుటుంబంలోని ఓ అమ్మాయి రేడియోలో పని చేస్తూందని విన్నాడు.

ఆ అమ్మాయి కంఠం లెక్క లేనన్ని సార్లు విన్నాడు, రేడియోలో. పెద్దయ్యాక తనుకూడా రేడియో ఎనౌన్సర్ ఉద్యోగం చేయాలి అనుకున్నాడు మహేష్, పద్దెనిమిదేళ్ళప్పుడు. తన గొంతు తను ఎన్నడూ వెళ్ళలేని ప్రాంతాలలో కూడా వినబడుతుంది అప్పుడు, అనుకొన్నాడు గర్వంగా.

తన బాబాయి కొడుకుతో హోటల్ కి వెళ్ళినప్పుడు బిల్లుచెల్లిస్తూ, పర్స్‌లోంచి కొత్త ఒక్క రూపాయల కట్టని వాడు తీయటం గమనించాడు. అప్పుడు అనుకున్నాడు తను కూడా బాబాయి కొడుకులా బేంక్‌లో క్లర్క్‌గా ఉద్యోగం సంపాయించాలని.

షేక్స్‌పియర్ వ్రాసిన 'కింగ్ లియర్' ఎంతో శ్రావ్యంగా, - వినాలనిపించేటట్టుగా, కుతూహలంగా పాఠం చెప్పే ఇంగ్లీష్ టీచర్ క్లాసులో, గొడవ చేసే విద్యార్థులు కూడా నిశ్శబ్దంగా, లీనమై వినేవారు పాఠాన్ని, ఆయనలోని టీచింగ్ కెపాసిటీని మెచ్చుకొని. తను

కూడా లెక్చరర్‌గా అవాలనుకున్నాడు గ్రాడ్యుయేషన్‌లో.

ఆర్థిక పరిస్థితులు ఆట్టే అనుకూలించకపోయినా, యం. ఏ. లిటరేచర్ సెకెండ్ క్లాసులో పేసయ్యాడు మహేష్. తర్వాత మహేష్ చాలా ఉద్యోగాలకి అప్లికేషన్లు పెట్టాడు. తను కోరుకున్న ప్రతి ఉద్యోగానికి తనకి అర్హత ఉండటంతో అప్లికేషన్లు పెట్టుకుని కొన్ని ఇంటర్వ్యూల కెళ్ళాడు.

తను అనుకోని ఉద్యోగాలకి కూడా అప్లికేషన్లు పెట్టుకుని కొన్ని ఇంటర్వ్యూలకి వెళ్ళాడు.

మహేష్ పెద్ద కోరికలు కోరలేదు. కలెక్టర్ అవాలనుకోలేదు. క్లర్క్ అవాలను కున్నాడు. డాక్టర్ అవాలనుకోలేదు. ఫైర్‌మన్ అవాలనుకున్నాడు. ఏక్టర్ అవాలను కోలేదు. కేవలం సైనికుడయితే చాలనుకున్నాడు.

కాని ఎన్నడూ జీవితంలో అనుకోని ఉద్యోగంలో చేరాడు – మహేష్. పరిస్థితులు ఆ ఉద్యోగానికి తప్పని సరిగా దారి తీయించాయి. ఆర్థిక పరిస్థితుల ముందు ఎవరయినా తల వంచక తప్పదు అని అనుకొన్నాడు.

అందుకే రిక్షా పుల్లర్ అయాడు మహేష్! (ఆ తర్వాత అతని రిక్షాలో రైలింజన్ డ్రైవర్లు, బేంక్ క్లర్కులు, సైనికులు, లెక్చరర్లులాంటి అనేక మంది ప్రయాణం చేసారు.)

“నవల మానవుని మనోదండిని కీర్తిస్తుంది, వివేచన జరుపుతుంది. కనకనే అది మన సాంస్కృతిక జీవితానికి ఒక విధంగా సంగ్రహమూ, సారరూపమూను.” (లియొనిల్ ట్రిల్లింగ్)

బెర్తోల్ట్ బ్రెష్ట్

ఛలోక్తులు, సూక్తులు

ఛలోక్తులతోనూ, చమత్కారాలతోనూ సత్యాన్ని సూటిగా చెప్పడం బెర్తోల్ట్ బ్రెష్ట్ ప్రత్యేకత. జర్మన్ మాతృక నుండి శ్రీ కాట్రగడ్డ గంగయ్య సేకరించినవి కొన్ని :

భూస్వామి భూమి విరాళం

1908 సంవత్సరం. ఫిన్లండ్‌లో బాగా చలిగా వున్న రాత్రి. భూస్వామి గారు పక్క ఊరికి వెళ్లవలసిన పని పడింది. గడ్డకట్టుక పోయిన పెద్ద సరస్సుమీద నడుచుకుంటూ పోవాలి. ఆ మంచుగడ్డ మీద 12 కిలోమీటర్లు నడవాలి. మధ్యలో ఎక్కడో గండిపడి వుందని తెలిసింది. ఖచ్చితంగా ఫలానా చోట పడిందని తెలియదు. పాలికాపు నొకడిని భూస్వామి తన ముందుగా నడిపించి, తాను అతని వెనక నడుస్తూ పోతున్నాడు. అయితే ఆయనగారి కెంతో భయంగా వుంది. ఆ సరస్సు దాటితే మంచి గుర్రం యిస్తానన్నాడు. సగం దూరం వెళ్లారు. “ఇదుగో, చూడు. నన్ను క్షేమంగా తీసుకెళ్ళేవో ఆవు దూడ నిస్తా” నన్నాడు. ఇంకొంత దూరం వెళ్ళేసరికి పక్క గ్రామంలోని దీపాలు కనిపించాయి. “ఇంకొంచం ఒళ్లు వంచి కష్టపడవయ్యా. నీకో గడియారం వస్తుంది” అని చెప్పాడు. ఒడ్డుకు అరవై గజాల దూరం మాత్రం వున్నప్పుడు, బస్తా బంగాళా దుంపలిస్తానన్నాడు. ఒడ్డు చేరాక “ఏం మనిషివయ్యా, పెళ్లి నడకలు నడుస్తూ కాలం అంతా దండగ చేసేశావు” అంటూ జేబులోంచి ఒక రూపాయి తీసి చేతిలో పెట్టి, భూస్వామి గారు ముందుకు సాగిపోయారు!

చక్కని జవాబు

"ఏవిధంగా ప్రమాణం చేస్తావు — దేవుడి పేరిటా, మరోలాగా?" అని కోర్టువారు ప్రశ్నిస్తారు కార్మికుణ్ణి.

"నేను నిరుద్యోగిని" అని కార్మికుడు జబాబిస్తాడు.

అది విని కె. గారు (బ్రెహ్ట్ హాస్య పాత్ర) అంటారిలా: "ఆ కార్మికుడలా చెప్పాడంటే, అతని ఏకాగ్రత చెడిందని మాత్రమే అనుకోకూడదు. ఈ జబాబుతో అతనందరికీ తెలియ జేసిం దేమిటంటే, తన ప్రస్తుత స్థితిలో అలాటి ప్రశ్నలకూ, బహుశా ఆ కోర్టు వ్యవహార మంతటికీ అర్థం పర్థం లేదనే!"

పునర్దర్శనం

కె. గారిని బహుకాలంగా చూడని మిత్రుడొకడు ఆయన్ని చూసి, "మీ రసలేం మారనే లేదు!" అని ఆశ్చర్య పడతాడు.

"అలాగా!" అని కె. తెల్లబోయాడు.

నచ్చజెప్పే ప్రశ్నలు

కె. గారి ఉవాచ: "మన సిద్ధాంతాలు అందర్నీ బెదరగొట్టేయడానికి, మనం అన్ని ప్రశ్నలకీ జబాబు చెప్తామనడమే కారణ మనిపిస్తోంది నాకు. మన ప్రచారం మరింతగా వ్యాపించాలంటే, మనకు ఏమాత్రమూ జబాబులు తెలియని ప్రశ్నల జాబితాను తయారు చెయ్యలేమా?"

యుద్ధారంభంలో (జర్మన్) కార్మిక స్త్రీ తన కుమారునితో

"మీరు వెళ్తున్నది మీ యజమానుల నెత్తురు వ్యాపారాన్ని కొనసాగించేందుకేనా?

మీ ముందు శత్రువుల ఫిరంగులు,
సైన్యాధికారుల పిస్తోళ్లు మీ వెనుక!
మరవ బోకండి నేను చెప్పేది —
మీది కాదు మీ యజమానుల ఓటమి,
వారి గెలుపు మీది కాదు!"

ఇద్దరు

దద్దరిల్లింది భూమాత ఆయన నడకకు, దద్దరిల్ల లేదు భూమాత యీాయన నడకకు. ఆయన వచ్చాడు — లోకమంతా చీకటి! ఈయన రాక యిచ్చింది వెలుగునే!

హిట్లర్ యుద్ధ సమాధి మీద రాత

నాన్నా, నువ్వు నన్ను సైనికుణ్ణవ నిచ్చావు!
అమ్మా, నువ్వు నన్ను దాచి పెట్టలేదు!
అన్నా, నువ్వు నాకు తప్పు సలహా యిచ్చావు!
అక్కా, నువ్వు నన్ను నిద్ర లేపలేదు!

లోకం పోకడ

తన సొమ్ము ఎత్తుక పోయారని దొంగ అరుపు!
తన ప్రాణానికి ముప్పని హంతకుడి ఫిర్యాదు!

అబద్ధాల కోరు నమ్మడు ఎవరి మాటా!

కంచంలో రవ్వంతైనా మిగల్చని తిండి పోతు ఉపదేశం:
కూలీ నాలీ జనం రాళ్ళే తినాలి!

ఎవరు నీ శత్రువు?

నీ నోటి దగ్గరి ఆఖరి ముద్దను మింగేసిన అన్నార్తుణ్ణి నీ శత్రువం టావు!
ఏనాడూ ఆకలంటూ ఎరగని తిండి దొంగను పల్లెత్తు మాటయినా అనవు!

కవితా యిటు చూడు

శ్రీమతి అడవికొలను పార్వతి

కవితా! యిటు చూడు! నీవు వెలిగించిన దీపాలు వేలకి వేలు!
ఎంత ఉజ్జ్వలంగా ప్రకాశిస్తున్నాయో!
ఎంత ఆనందాన్ని పంచి యిస్తున్నాయో!
ఎన్నో సాయంత్రాలు
ఈ మనుష్యులు ఆత్మస్తుతి, పరనింద చేసుకుంటున్న వేళ
మనం నిర్మల హృదయంతో
ఎంత సాహితీ చర్చ జరిపాం!
బలవంతులు బలహీనుల నణిచే వ్యవస్థ మారాలని
కరువు కాటకాలు లేని బంగరు కాలం రావాలని
ప్రతి యింట్లో సాహిత్యం సంతోష నాట్యం చేయాలని
ఈ సమాజం సమతా సమాజంగా మారాలని
ఎన్నెన్నో ఆలోచనలు చేశాం —
ఈ ఆలోచనల నరికట్టాలని
ఈ ఆశయాల్ని సమాధి చేయాలని
కాటుక కొండల్లాంటి అడ్డంకు లెదురయ్యాయి
శారీరకంగా, మానసికంగా
బాధల వలయాలు చుట్టుముట్టాయి

ఆ బాధల్లోంచే
మరింతగా నా కర్తవ్యాన్ని నెరవేరుస్తున్నాను!
నిన్ను దర్శించిన కొద్దిక్షణాలే నా జీవితంలో
మరపురాని మధుర సుధా తరంగ వీచికలు
ఎన్నో ముళ్ళ కంచెల్ని, మెట్టపల్లాల్ని దాటుకుంటూ
ఎంతో ఉత్సాహంతో అడుగిడి
నాలోని ఆశల్ని, ఆశయాల్ని
మరింత ఉజ్జ్వలంగా ప్రకాశింప జేస్తున్నావు
ఈ జీవన పోరాటంలో నేనలసి పోయినా
నా వంతు పోరాటం నీపై వేసుకుని
బలవంతులు బలహీనుల్నణచని వ్యవస్థని
వనితల బ్రతుకుల్లో కష్టాల కారుమేఘాలు
అంతమయ్యే వ్యవస్థని
సమతల మమతల చల్లని కాంతి వర్షంలో
జగత్తంతా పునీతమయ్యే వ్యవస్థను
అందమైన ఆరోగ్య వంతమైన సమతా వ్యవస్థను
నిర్మించు — నీ సర్వశక్తులూ ధారపోసి.

నీకు నువ్వే ఉన్నత న్యాయనిర్ణేతవి. నీ రచనను నీ అంత బాగా ఎవ్వరూ విలువకట్టలేరు.
నీవు సంతృప్తి పడితే చాలు —
— పుష్కిన్.

తెలుగు కథానికలు - సంపుటాలు

"శ్రీవిరించి"

'కథానిక' ప్రక్రియ చాల ముందంజ వేసిందనీ ప్రపంచ సాహిత్యంలో 'తెలుగు కథానిక' ప్రముఖమైన స్థానాన్ని ఆక్రమించుకున్నదనీ అనేక సందర్భాలలో చెప్పకుంటూ వుంటారు, గర్వంగా. అయితే ఈ ప్రక్రియను ఇంత వరకు మనం 'సీరియస్'గా తీసుకోలేదేమో అనిపిస్తుంది. 'కాకమ్మ కథలు' కాకుండా సర్వజనీనత, సర్వసమన్వయత, సర్వరమణీయకత పుణికి పుచ్చుకున్న కథలు యింకా రావలసి వున్నాయి అని కూడా అనిపిస్తుంది.

'తెలుగు కథానిక' షష్టిపూర్తి చేసుకున్నది. మరో రెండు సంవత్సరాలలో ఏడో పది కూడా నిండుతుంది. అయితే యిప్పటివరకు ప్రచురణ అయిన కథా సంపుటాల సంఖ్య డెబ్బయి అయినా వున్నదా అంటే అనుమానమే! పత్రికల ఆదరం వల్ల ఎక్కువ కథలు ప్రచురణ అవుతున్న మాట నిజమే. అయితే 'పుస్తక రూపం' లో కథా సంపుటాలు రాకపోవడం వల్ల మనం యెక్కడ వున్నామో, యేమి చేస్తున్నామో సరిచూచుకుందుకు కొలత బద్ద లేకుండా పోతోంది. కథా సంపుటాల ప్రచురణలో రెండు పద్ధతులు వున్నాయి. ఒకటి, ఒక రచయిత వ్రాసిన కథలు కొన్ని ఒక పుస్తకంగా తీసుకు రావడం. రెండు: వివిధ రచయితల వ్రాసిన కథలను ఒక చోట చేర్చి వీలయితే సంపాదక వివరణ యిస్తూ పుస్తకంగా ప్రచురించడం. ఈ రెండో పద్ధతిని యింతవరకు తెలుగులో ప్రచురణ అయిన పుస్తకాల సంఖ్య పది పన్నెండు కంటే లేదు.

కథానిక అనేది పాశ్చాత్య ప్రక్రియ అనుకుంటారు కొందరు. ఈ అభిప్రాయం సరికాదని చెప్పటానికి చాల చారిత్రక ఆధారాలు వున్నాయి. ప్రహేళిక, ఆఖ్యాయిక, ఖండకథ, హరికథ, గల్పిక వంటి రూపాలు సంస్కృతంలో వున్నాయి. అగ్ని పురాణంలో 'కథానిక' ప్రసక్తి వుంది. సంస్కృత పాళీ భాషలలోనే కాకుండా యితర భారతీయ భాషలన్నింటిలోను అనేక వేల సంవత్సరాల క్రిందటనే 'కథలు' వున్నాయనడానికి ఋజువులు వున్నాయి. కాకపోతే తతిమ్మా సాహిత్య ప్రక్రియల లాగానే, కథానిక ప్రక్రియ కూడా ఆంగ్ల, ఇతర పాశ్చాత్య భాషల ప్రచారం వల్ల 'పరిపుష్టం' అయింది. ఇతర దేశాల కథలలో కనిపించే మెరుపులు, విరుపులు మన కథకులు కూడ ప్రయోగాలు చేసి చూశారు, యింకా చేస్తున్నారు. సరికొత్త పద్ధతులు కనిపెట్టి వాడుకున్నారు. ఈ ప్రక్రియను సంఘ సంస్కరణకోసం ఎక్కువగా వాడుకున్నారు మొదటి రోజులలో. భాషావికాసం, యాత్రల సహకారం, రాకపోక అవసరాల పెరుగుదల యిటువంటి వన్నీ సమకూడిన మీదట మనం యిప్పుడు చూస్తూవున్న 'కథానిక' రూపుకట్టుకుంది. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత ప్రపంచ సాహిత్యంలో వచ్చిన అనేక మార్పులు మన రచనలలోను కనిపిస్తాయి. రెండో ప్రపంచ యుద్ధం తరువాత సరేసరి! ప్రపంచయుద్ధంవల్ల వచ్చిన సంక్షోభం, కుటుంబాలలో ఒడుదుడుకులు, తండ్రులు

కొడుకులు భార్యాభర్తలు చీలిపోయి కుటుంబ వ్యవస్థ రూపుమారి పోవడం దాదాపు పది పదిహేను సంవత్సరాలు 'కథలు' గా చదువు కున్నాం గదా!

తెలుగులో 'కథానిక' ప్రక్రియ అతి శ్రోత్రియులయిన రచయితలను (కవులు) కూడా ఆకర్షించింది. ఇదో విశేషం. ప్రక్రియగా దీనిపట్ల అంత ఆదరం లేకపోయినా చాలమంది కవులు దీనిని చక్కగా ఆకట్టుకున్నారు. కథానిక స్వరూపాన్ని చక్కగా వినియోగించు కున్నారు. దీనికి సామాజికమూ సాహిత్య పరము అయిన విలువను సంపాదించి పెట్టారు.

సాధారణంగా 'వచన రచన' అనేది చాల 'DRAB' అయిన విషయం. సాఫీగా చదివించడం కష్టం. ఈ వచనాన్ని కధాత్మకంగా చేసి కొంతవరకు కళాత్మకత, కల్పన జోడించడం అవసరం అవుతుంది, కధా రచనలో. యదార్థ మయిన జీవితాన్ని ఉన్నది ఉన్నట్లుగా చూపించి కథ రాణింప చేయ వచ్చును. అయితే కథకు యదార్థతను చిత్రించడం కంటే మరేం ప్రయోజనం లేదా – అని పిస్తుంది. ఉంటే ఆ ప్రయోజనం యేమిటి? అనేది పెద్ద ప్రశ్న. – 'మంచి రచన' అంటే యేమిటో నిర్ణయించడం కష్టం, ఈ పనిని కాలమే చేయాలి - అనుకుంటారు కొందరు. 'ఈ రచన నిలుస్తుంది, యీ రచన నిలువదు' అని తీర్పు చెప్పేస్తూ వుంటారు మరి కొందరు. 'లోకశ్రేయస్సే' రచనకు ప్రధానం అని అనుకున్నా, ఈ లోకశ్రేయస్సు యిదే అని నిర్ధారణకు రాగలగడం కష్టం అయిపోతుంది. నిజానికి 'రచన' అంటే యీరకంగానే వుండాలి అనే సిద్ధాంతం లేదు. రచన చేయాలంటే మనం యితరలకు చెప్పవలసింది, చెప్పకుండా వుండలేనిది యేమయిన వుండాలి. ఫలాన వస్తువు యితరులకు లభించేట్టు చేయాలి అనే ఆకాంక్ష ముఖ్యం. ఈ విషయం తెలుసుకోవడంవల్ల అందరి విజ్ఞానము, వినోదము ఒక స్థాయి పైకి పెరుగుతుంది, అనిపించాలి. ఏ రచన అయినా 'లోకశ్రేయస్సు' కోసరమే. సమాజంలోని స్థితిగతులను గ్రంథస్థం చేయడం, వీటిలో రావలసిన మార్పులను సూచించడం, ఈ మార్పులు వస్తే సమాజం యెలా 'నవనవ' లాడుతూ వెలిగి పోతుందో, రాకపోతే యెలా 'కుతకుత' లాడుతుందో వివరించడం – యివీ రచనకు ముఖ్యంగా మూలకందమయిన విషయాలు.

రచన చేయడం ముఖ్యంగా 'కథ' వ్రాసి పడేయడం – చాల తేలిక అనుకునే వాళ్ళు వున్నారు. ఎందుకంటే దీనికి ఎవరినుంచీ 'లైసెన్స్' తీసుకో వలసిన పనిలేదు. కథా సాహిత్యంలో యిప్పుడు ప్రేమ-ప్రణయం – తిరస్కారం; ఆకలి - బీద – బిక్క – శ్రీమంతులు లాంటి వ్యత్యాసాలకు ఎక్కువ ఆస్కారం వుంది. కథ మనిషి జీవితములో ముఖ్య భాగం అయిపోయింది. 'ఇలా జరిగితే యేమవుతుంది. మనిషి ప్రవర్తనకు యింతకంటే మంచి మార్గం వున్నదా?' – యీ రకమయిన ప్రస్తావనలు కథల వల్లనే వస్తాయి. సమకాలిక జీవితాన్ని ప్రతిబింబించేది 'సాహిత్యం'. ఈ నిర్వచనాన్ని పుణికి పుచ్చుకున్నది 'కధానిక'. కథ వీనికి ఎంత దగ్గరగా వస్తున్నదంటే కధలే సాహిత్యం, పద్యాలు పాటలు ప్రబంధాలు సాహిత్యం కానే కాదు అనే భ్రమ కలిగిస్తుంది ఒక్కొక్కమారు.

ఆడపిల్లలు – స్త్రీ పురుష సంబంధాలు – పెళ్లిళ్లు – కట్నాలు యీ దశ

గడిచిపోయి ఆడపిల్లలు – ఉద్యోగాలు, ఉద్యోగాలవల్ల జీవితంలో వచ్చే మార్పులు, పిల్లల పెంపకంలో కలిగే యిబ్బందులు, యిటువంటివి చిత్రించే కథలు అనేకం వస్తున్నాయి. అంటే ఒకదశలో జీవితంలో ప్రధానంగా కనిపించిన 'ప్రేమ' అంతస్తు దాటిపోయి కథ మరి కాస్త ముందుకు వచ్చిందన్న మాట. మనుష్యులు తమను తాము 'DISCOVER' చేసుకుందుకు కథానిక బాగా పనికివస్తుంది.

ఇటువంటి ఉత్తమ సాధనంగా వున్న కథానికను మనం 'సీరియస్'గా తీసుకోకుండా యేదో 'ఆషామాషీ'గా అవసరార్ధంగా వాడుకోవడం మనను మనం సంకుచిత పరుచుకోవడం కాదా! నిజమయిన న్యాయం, ప్రయోజనం సమకూర్చాలనుకుంటే కథాసంపుటాలను ఎక్కువగా తీసుకువచ్చి చదువరుల ప్రత్యేక అభిరుచులకు తోడ్పడడం తప్పనిసరి.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య ఎకాడెమి వారు ప్రతి సంవత్సరం ఒక కథా సంపుటానికి 1116/ – బహుమానం యిస్తారు. ఆ సంవత్సరం వారి దృష్టిలో మంచి పుస్తకం రాకపోతే ఆ డబ్బు వారికే మిగిలిపోతుంది. పత్రికల వాళ్ళు ప్రతి సంవత్సరం అయిదారు వేలు కథల పోటీల బహుమానాల కింద వినియోగిస్తారు. బహుమతి పొందిన కథలను గురించి చక్కటి విమర్శలుగాని, విలువలను చేరీజు వేయగల ప్రమాణాలుగానీ రావు. ఇటీవల చెప్పుకోదగినంత మంచి కథలను ప్రచురించని ఒక మాసపత్రిక, తాము ఆలా చేయటానికి 'రచయితలు మంచి కథలు అందించక పోవడమే కారణం' అని సంపాదకీయ వాఖ్యలాంటిది వ్రాసింది. ప్రచురణకర్తలు కథానిక సంపుటాల ప్రచురణకు జంకుతారు, యెందు చేతనోగాని.

తెలుగులో మంచి కథానికలే రావడంలేదని అనడం సాహసం. అయితే యీ మంచితనం ఎక్కడుందో, దీన్ని యేరి పట్టుకోవడం ఎలాగో సామాన్య పాఠకుడికి తెలియ చెప్పడం జరగడంలేదు. కథా సంపుటాలు, ముఖ్యంగా వివిధ రచయితల కథలు – తగుమాత్రపు సంపాదక వ్యాఖ్యలతో ప్రచురణ కావలసిన అవసరం చాలవుంది. పాఠకులు కథలకోసం కేవలం పత్రికల మీద ఆధారపడకుండా, మంచి రచనలు యేరి కూర్చిన సంపుటాలను కూడ కొనుక్కోగల అవకాశం కల్పించాలి, ప్రచురణ కర్తలు.

కథల ప్రమాణం పెరగడం కోసం నిర్దిష్ట మయిన కృషిజరగాలి. కథా రచన ప్రక్రియ మయిన వివరణలు, విమర్శలు ఎక్కువగా రావాలి. రచనా శిల్పం మరింత సునిశితం అయేందుకు యివి దోహదం చేస్తాయి. ప్రతి సంవత్సరం పత్రికలలో ప్రచురణ అయ్యే కథలను పరిశీలించి వాటిలో 15,20 కథలను యెన్నిక చేసుకొని ఒక సంపుటంగా తీసుకు రావచ్చును. ప్రతి ప్రచురణ సంస్థ సంవత్సరానికి ఒక పుస్తకమయినా యిటువంటిది తీసుకు రావచ్చును. ఇటువంటి పుస్తకాలు సమర్థులయిన సంపాదకుల అజమాయిషీలో చక్కని వివరణలతో ఎన్ని ఎక్కువ వస్తే అంత మంచిది.

అలాగే తెలుగు కథానికలలో ఎన్నిక చేసిన వాటిని ఇంగ్లీషు హిందీ భాషల లోనికి అనువదింపచేసి ప్రచురించడం కూడా అవసరం. ఈ భాషలలో మన కథలు

ప్రాచుర్యం పొందకపోతే మన కృషి నాలుగు గోడల మధ్యనే గాని 'దేశవ్యాప్తం' కాదు. ఇంగ్లీషు తెలుగు కథా సంపుటాలు ప్రతి సంవత్సరమూ నాలుగయిదయినా ప్రచురణ కావడం అవసరం. తతిమ్మా భారత భాషల రచయితలు, ప్రచురణ కర్తలు యీ విషయంలో ముందువున్నారు. తెలుగు, కన్నడ భాషలే వెనకబడి వున్నాయి.

ఇటువంటి పనులు ఏ ఎకాడమీలో, సంస్థలో చేయడం విధాయకం అయినప్పటికీ – అవి పనిచేసే తీరుతెన్నులు తెలిసిన వాళ్లు యెవరు యింత మంచి పనిని వాళ్ళ నుంచి ఆశించరు. ఒకవేళ వాళ్లు పూనుకున్నా 'ఆశ్రిత జన పక్షపాతం', 'ప్రాంతీయ దురహంకారాలు', 'మైనారిటీల హక్కులు కాపాడాలనే నినాదాలు' వస్తాయి తప్ప, సాహిత్యానికి నిజమయిన ఉపకారం జరగదు. అందుచేత, ఓపిక, తీరిక, సామర్థ్యము, చాకచక్యము వున్న వ్యక్తులు, ప్రయివేటు ప్రచురణ సంస్థలు యిందుకు పూనుకోవడం మంచిదనుకుంటాను. అప్పుడే చేసిన పనికి 'శోభ' యేర్పడుతుంది.

కేవలం 40 సంవత్సరాల వయసున్న నవ్యకవిత్వంతో పోలిస్తే, 'కథానిక' ప్రచురణ విషయంలో ఎందుకూ చాలదు. పరమ ప్రమాణిక మయిన కవితా సంపుటాలు దాదాపు 'పది' ప్రచురణ అయివుండగా, పోనీ అప్రమాణికమయినవయినా కథా సంపుటాలు (వివిధ రచయితలవి) పది పన్నెండయిన లేవుగదా! వ్యక్తిపరమయిన కవితా సంపుటాలు నెలకు రెండో మూడో ప్రచురణ అవుతూంటే కథా సంపుటం సంవత్సరానికి నాలుగయినా వస్తున్నవో లేదో! చదువరులకు చాల దగ్గరిదీ, సాంఘిక ప్రయోజనాన్ని సమకూర్చేది అయిన 'కథానిక' విషయంలో మనం ఎక్కువ శ్రద్ధ తీసుకోవడం శ్రేయస్కరం.

వాస్తవికత అనేది ఒక సృజనాత్మక క్రియా పద్ధతి. అదొక చారిత్రక ఘటన. ఒకానొక మానవ మేధావికాస దశలో అది పుట్టింది. ప్రకృతినీ, సామాజికాభివృద్ధి గతి క్రమాన్నీ అవగాహన చేసుకోవలసిన అవసరం చాలా ముఖ్యమని అర్థంచేసుకో నారంభించా రప్పటికి. మానవుని పనులూ, భావనలూ ఏదో ఉద్ధతావేశాల ఫలితంగానో, దైవ నిర్దిష్టంగానో జరుగుతున్నవి కావని యథార్థమైన – అంతకంటె సరిగ్గా చెప్పాలంటే, భౌతికమైన కారణాలే వానిని నిర్ణయిస్తుంటాయనే పరిజ్ఞానం మొదట చూచాయగా, తరవాత తరవాత మరింత విస్పష్టంగా గుర్తించ సాగారప్పటికి. సామాజిక సంబంధాల విసను, దాని నడకను నిర్ధారణచేసే నిగూఢ, మూలశక్తులను గుర్తించే కర్తవ్యం సామాజికుల కెదురైనప్పుడే కళ, సాహిత్యాలలో వాస్తవిక పంథా బయలుదేరింది.

'హిస్టరీ ఆఫ్ రియలిజం' నుండి. రచయిత : బోరిస్ సుచ్కోవ్

1838 అక్టోబరులో కాలక్షేపానికి మాల్థూస్ వ్రాసిన 'పాప్యులేషన్' చదవడం సంభవపడింది. దీర్ఘకాలంగా జంతువులు, మొక్కల అలవాట్లను నిశితంగా పరిశీలిస్తూండడంచేత, ఎటుచూసినా కనబడే జీవన పోరాటాన్ని అర్థంచేసుకోగల స్థితిలో వున్నానేమో – దానిని చదువుతున్నప్పుడు చట్టున ఆయా పరిస్థితులతో అనుకూల పరివర్తనలు నిలవబడి, అననుకూల పరివర్తనలు నాశనంచేయ బడతాయనీ, దానిఫలితంగా నూతన జీవజాలం ఏర్పడుతుందనీ అనిపించింది.

ఛార్లెస్ డార్విన్

"రండి లోపలికి బాగా వర్షంగా వుంది. కాస్త తెరెపి యివ్వగానే వెళ్ళొచ్చు." వెనక్కి జరిగి, మొహం తుడుచు కుంటూ అన్నాడు. తట పటా యించింది. మరో సారి వెఱ్ఱిగా గాలి, గదిలో ముందు భాగం తడిసిం దీసారి జల్లుకి. చటుక్కున లోపలికి అడుగు వేసింది. చలికి వణుకు పుడుతోంది. తడిసిన పమిటనే మరింత బిగదీసు కుంది. "కొంచెం వుండండి" అంటూ, ముందుకు వచ్చి తలుపులు వేశాడు తటాలున. భయం భయంగా చూసింది ప్రమీల. దండెం మీది తువాలు తీసి యిస్తూ "తుడుచు కోండి" అన్నాడు. తలుపులేసే లోపుగా అతనూ కొద్దిగా తడిశాడు మరో తువాలు తీసి ముఖం తుడుచుకున్నాడు. తువాలు అలాగే చేత్తో పట్టుకుని నిలబడిపోయింది, తలుపుకి పక్కగా. అయోమయంగా వుంది. 'ఏమిటీ వర్షం, ఆకాశానికి పిచ్చె త్తిందా? ఇలా ఎంతసేపని తనుం టుంది? తలుపులు కూడా వేసేశాడే!' గుండెలు దడదడ మన్నాయి. ఓ స్టూల్ ముందుకు జరుపుతూ 'కూర్చోండి' అన్నాడు. వారగా ఓ మడత మంచం, మరో పక్క అలమార్లో ఏవో పుస్తకాలు. గోడకి అద్దం, చిన్నగది. బ్రహ్మచారి నిలయం. బెరుగ్గా స్టూలు మీద కూచుంది. మొహమాట పడుతూనే మొహం తుడుచుకుంది. 'ఆ రౌడీ రాంబాబు బృందంలో యీ రెడ్డీ ఓ ముఖ్యుడే. ఆడ పిల్లల్ని ఏదో ఒకటి అని ఏడిపిస్తూనే ఉంటారా బృందం వాళ్ళు. కాలేజీ మొత్తానికి ఆ బృంద మంటే హడలే. ఆడ పిల్లల పాలిటి రావణులు, కీచకులూను. మేక తిన్నగా వెళ్ళి పులి నోట్లో పడ్డట్టు పడిం దిక్కడ తను. తన నేమయినా చేస్తే .. చేస్తాడా? అసలు తనెలా లోపలి కడుగు పెట్టింది? ఇప్పుడు వెళ్ళిపోత నంటేనో! ఇంత వర్షంలో నడవడవే కష్టం, హోరున ఆ గాలి కూడాను ఎలాగైనా సరే వెళ్తేనే మంచిది. తలుపు తియ్య మంటాను. 'ఏం' అని అడిగితే తను భయపడు తోందని తెలిసిపోతుం దేమో! తెలిస్తే మరీ లోకువ. ఎలా! ఎలా ఇప్పుడు? ఏమైనా సరే! ఇంట్లో కంగారు పడతారు, ఎలాగైనా చేరు కోవాలి అని చెప్పి ..." ముఖం తుడుచుకుంటున్నట్లు నటిస్తూ, తువాలు ఓ పక్కకు ఒత్తిగించి ఓరగా చూసింది. మంచం చివర కూర్చుని, అటువేపు తిరిగి, సిగరెట్టు వెలిగిస్తున్నాడు. గొంతు సర్దుకుంది. అంతే! టక్కున లైట్లు ఆరిపోయాయి. ప్రమీలకి గుండెలు జారిపోయాయి. "మై గాడ్" పైకే అనేసింది. "కరెంటు పోయినట్టుంది" నెమ్మదిగా రెడ్డి మాట. క్రూర మృగ మేదో నాలుక చప్పరించుకుంటున్న ట్టుంది ప్రమీలకి. అంత వరకూ ఎలాగో కళ్ళాలు బిగించి పట్టుకున్న ధైర్యం, పెంకి గుర్రంలా పట్టుతప్పించుకుని పారి పోయింది. ప్రమీలకి అంత వర్షంలో చెమటలు పట్ట సాగాయి. సన్నగా వణుకు. "తన పని అంతే! భగవాన్! పాడు సినిమా! ఎందు కెళ్ళానో! అసలే రౌడీ! ఆ పైన అనుకూల వాతావరణం. కళ్ళ నిండుగా నీళ్లు కమ్ముకొచ్చాయి. చిన్నగా చప్పుడు. ఉలిక్కిపడింది. వచ్చేస్తునాడు.. వచ్చేస్తున్నాడు.. తన గతి ... అమ్మ! నాన్నా ... ఈ పాడు సినిమా కోరిక . నన్నెంత గతి కీడ్చిందో! ఏం చెయ్యాలి! చెయ్యి కొరికి.. లేకపోతే.. ఈ స్టూల్ ఎత్తి

నెత్తి మీద ఒక్కటి పెడితే.. గట్టిగా అరచి.. అబ్బే! ఈ వానలో హోరులో ఎవరు వినిపించు కుంటారు? గుండెలు. భయంతో విపరీతంగా కొట్టుకుంటున్నాయి. అంతలో ఛాతీ మీద ఏదో స్పర్శ. వెఱ్ఱిగా, భయంతో 'కెవ్వు' మంది "ఏమిటండీ.. ఏమిటది?" గదిలో మరో మూలనుంచి రెడ్డి కంఠం.

"ఆ!" అతను.. కంఠం ఆ మూల నుంచి.. ఓహ్! అతను తన దగ్గరకు రాలేదన్న మాట. "అమ్మయ్య!" ఇంకా ఆమె కోలుకోలేదు. మళ్లీ అడిగాడతను ఆశ్చర్యపడుతూ!

తడబాటు నణచుకుంటూ చెప్పింది. "ఏం లేదండి, ఏదో వంటిమీద పాకినట్టయింది" కంఠంలో వణుకు తగ్గలేదు.

"అదా! బొద్దింక అయుండచ్చులెండి."

"ఇంకా అక్కడే వుండి మాట్లాడుతున్నాడే. సినిమాలో విలన్‌లా నెమ్మదిగా, కులాసాగా, నవ్వు కుంటూ వెనగ్గా వచ్చి.." వెన్నులో ఝల్లుమంది. అగ్గి పుల్ల గీసిన చప్పుడు. ఆ చిన్న వెలుగులో అతని ముఖం భయంకరంగా! అప్పుడు అటు తిరిగి కూర్చున్నాడు. ఇప్పుడు ఇటు తిరిగాడే! అలాగే.. మెల్ల మెల్లగా లేచి తన వేపు... ఏడుపు గొంతు లోంచి దూకడానికి మారాం చేస్తోంది. తువాలు నోట్లో కుక్కుకుని లేచి నిలబడింది. తలుపు కనిపించటం లేదు. చీకటి. కాని ముందుకు అడుగు వేసింది తలుపు కేసి. 'గొడుగు వుండాలే' స్వగతంలా అన్నాడు. మరో అగ్గిపుల్ల గీసాడు. అలమారు పైకి ఎత్తి పట్టుకుని చూశాడు. 'ఆ వుంది!' మరో.. అగ్గి పుల్ల, కాళ్లెత్తి రెండో చేత్తో గొడుగందుకున్నాడు. "కొవ్వొత్తి కూడా లేదు." మళ్ళీ స్వగతం. మళ్ళీ అగ్గిపెట్టికి పని తగిలింది. జాగర్తగా చెయ్యి అడ్డం పెట్టి చూపిస్తూ, "అక్కడే వున్నారా! గొడుగు తీసుకోండి. తరువాత యిద్దరు గాని." "తలుపు తీస్తానుండండి" అంటూ, మళ్ళీ అగ్గి పుల్ల గీయకుండానే తలుపు గడియ తీసాడు. ఒక్క ఉదుటున బయటకు దూకింది కుందేల్లా. కాస్త వెలుగ్గా అన్పించింది. అటు, ఇటు వూగే గొడుగును అతి కష్టం మీద ఆపుతూ, జాగ్రత్తగా అడుగు వేసి, తమ యింటి కెదురుగా గుళ్లో వేంచేసిన అమ్మ వారి విగ్రహాన్ని తల్చుకుంటూ ఇల్లు చేరింది ప్రమీల.

మరునాడు.

"ఆ రాంబాబు గుంపులో రెడ్డిని చూశావే! విగ్రహం చూస్తేనే భయం వేస్తుంది." వసంత, వయ్యారంగా నవ్వుతూ అంది పక్కనున్న ప్రమీలతో.

ఫక్కున నవ్వింది ప్రమీల. "ఆ - నా మొహం. విగ్రహపుష్టి, నైవేద్యనష్టి అని, అతన్లో సరుకేం లేదే పిల్లా! భయపడ వలసిన పనేలేదు" అంది. తల ఎగరేసి, కొంటెగా కళ్లు తిప్పింది. "ఏమిటి సంగతి?" చెలికత్తె లంతా ఉత్సాహంగా అడిగారు. ప్రమీల క్రితం రాత్రి సంగతి చెప్తూ, చివర్న, "వాళ్ల రూములోని బొద్దింక నయమనుకో!" అని విరగబడి నవ్వింది. చెలికత్తెలు కిలకిలలాడారు. ఓ అమ్మాయి వెనక్కి చూసింది. "అడిగోనే రెడ్డి." గుసగుసగా అంది. "బొ... బొద్దింక." కిసుక్కు మన్నాయి కొన్ని కంఠాలు. రెడ్డి తిన్నగా ప్రమీల పక్కకి వచ్చేశాడు. చటుక్కున ఆమె నడుము చుట్టూ చెయ్యి వేసి, దగ్గరకు లాక్కుని, మెరుపులా

చెంపకి పెదవులానించి వదిలేశాడు. నివ్వెర పోయి, నిలబడ్డారంతా. చెంప తడుము కుంటూ, అవమానంతో క్రుంగి పోతూ, కోపం, దుఃఖం పెనవేసుకోగా, కీచుగా అరిచింది ప్రమీల. "ఏమిటిది?"

రెడ్డి చిన్నగా నవ్వి, తాపీగా సిగ రెట్టు వెలిగించాడు.

"చూడమ్మా! బుల్లెమ్మా! మంచి తనం – పిరికి తనం. అణకువ – అతి వినయం. నిర్లిప్తత- చేతకానితనం. ఇలా కొన్ని కొన్ని విషయాలని వేరు చేసేది అతి సన్నని గీత. కళ్లు, బుర్ర ఉప యోగించి అది కనిపెట్టాలి. దేని కివ్వ వలసిన విలువ దానికివ్వాలి. లేకపోతే ఇలా . . . బెడిసి కొడుతుంది. మోడర్న్ లేడీస్, అభ్యుదయ భావాలు గల మీ రంతా ఇది తెలుసుకోండి మరి, ఈ విలువలు."

నెమ్మదిగా నడుస్తూ వెళ్లాడు రెడ్డి.

అనాథ . . . . గులాం గౌస్

ఉదయాన్నే రైలు తల్లి
కేకలతో నిద్ర తలుపు తడుతుంది.
దూరంగా నీళ్ల పంపు
నులి వెచ్చటి విషాదాన్ని
ఆపుకోలేక విడిచేస్తూ
వెక్కిళ్ల కోసం వాడి కళ్లల్లో
వెదుకుతుంది.
ఎవరో? ఆ బాలుడు, పసి ఆరనివాడు
ఖడి వయసులో పడిపోయిన జీవితాన్ని
ఎంగిలి బీడీలతో తగలేసుకుంటున్నాడు
ఒంటి మీద పీలికలు పీలికలై గాలిస్తాయి.
అతడి కళ్లు రెండు
వెళ్లి పోయిన రైలు శబ్దాన్ని
కౌగలించుకొని ఏడుస్తాయి.
ఏ గాలి వాడికోసం పాలు తెస్తుంది.
ఏ పువ్వు మాతృ స్తన్యమై
వాడి పెదవులకు అందుతుంది.
కాలం విడిచిన కుబుసాల్లాంటి పట్టాల్లో
భవిష్యత్తు విషగ్రస్తమై
బుసలు కొడుతుంది.
పశువులు ఇళ్ళకు చేరుకుంటాయి.
పక్షులు గూళ్లకు చేరుకుంటాయి.
శవం లేచిపోయిన తరువాత
బావురు మంటూ మిగిలిన
శిథిల ప్రాంగణంలో
సంధ్య వెలుగు సమాధిలా
మంట మండుతుంది.
విరగ బూచిన శిరీష వృక్షం,
వేళ్ళు పెరుక్కొని ఆకాశ మార్గం
పట్టినట్లుంటుంది.
మబ్బు ముక్క ఒకటి కమిలిపోతుంది.
చిట్టి చినుకు ఒకటి వణుక్కుంటూ
నేలకు రాలి
గీతలా నిలబడ్డ వాడి కాళ్ల క్రిందకు చేరి
వాడ్ని ఆశ్చర్యార్థకంలా
మలచాలని చూస్తుంది.
రెండు చేతులు చేంతాళ్ళలా
దుమ్ములోకి జారవిడిచి
తెంచి పారేసి పోయిన తల్లిపేగుకోసం
పాతాళం వరకు ఆత్రుతగా
వెతుక్కుంటాడు.
ఒంటరి మైదానంలో నడుం విరిగిన
గడ్డిపరక
శోకమనే మంచు పర్వతాన్ని
మోస్తున్నట్టు కనిపిస్తాడు.
అప్పుడు వాణ్ని ఏ విదూషకుడూ
నవ్వించలేడు.
ఏ వైద్యుడూ నాడి అందుకోలేడు.

'అభ్యుదయ' గురించి

చర్చావేదిక

డిసెంబరు 3 వ తేదీన పొట్టి శ్రీ రాములు స్మారక మందిరంలో ఆంధ్ర ప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం మద్రాసు శాఖ అధ్వర్యాన జరిగిన సమావేశం 'అభ్యుదయ' పత్రిక గురించి చర్చతో ప్రారంభమయింది. శ్రీ ఎ. బి. సాయి ప్రసాద్ పత్రికలో ఒకే వ్యక్తి వ్రాసినవి ఒకటికన్న ఎక్కువ రచనలు వుంటున్నాయని, అటువంటిది జరగనీయకూడదన్నారు. తరవాత పత్రికలో ఒక రాజకీయ సిద్ధాంతాన్ని ప్రచారం చేసే రచనలు మాత్రమే వేస్తున్నారని అభ్యంతరం చెప్పేరు. డిసెంబరు 'అభ్యుదయ' లోని హిందీ కధ "ఖోలా రాముడి ప్రాణం" కన్న మంచివి హిందీలో వస్తున్నాయనీ, ఈ కధను ఎన్నుకోవడం ఒక సిద్ధాంత ప్రచారానికి పత్రిక నుపయోగిస్తున్నారన్న తమ అభిప్రాయానికి సాక్ష్యం అన్నారు శ్రీ సాయిప్రసాద్.

శ్రీ జి. సి. జీవి యీ ఆరోపణకు జబాబు చెపుతూ, అభ్యుదయ ఒక సిద్ధాంత ప్రచారం చేస్తున్నదన్న వాదాన్ని నిరాకరించేరు. అన్ని భావాలకూ చోటు ఇవ్వాలంటూ, ప్రజాభ్యుదయానికి వ్యతిరేకంగా వుండే వాదాలకు చోటు ఇవ్వరాదన్నారు.

ఒకే వ్యక్తి వ్రాసినవి ఒక్కటి మించి వేయకుండేందుకు ప్రయత్నిస్తామని శ్రీ మహీధర చెప్పిన దానికి "అయితే ఒకే మనిషి మారుపేర్లతోనూ, పేరు లేకుండానూ వ్రాస్తున్నార"ని శ్రీ ప్రసాద్ సభ్యులతో పాటు తామూ నవ్వుతూ అన్నారు.

శ్రీ మహీధర "ఔను. పత్రికను నిర్వహిస్తున్న వాళ్లకి అది తప్పడం లేదు ఉదాహరణకి ఈ గోష్ఠి సమావేశాల రిపోర్టు నేను వ్రాస్తున్నాను. అదేగాక ఇతరం కొన్ని వ్రాయక తప్పడం లేదు. మన 'అభ్యుదయ'లో విదేశీ సాహిత్యాల నుంచి ఒక కథను ఇవ్వడమో, మంచి నవలను పరిచయం చెయ్యడమో మంచిదనుకొన్నాం. అలానే దేశ భాషా సాహిత్యాల నుంచి ఒక

శ్రీ శ్రీ శుభాకాంక్షలు

సోదర సాహిత్య సంస్థ జరుపుకుంటున్న 8 వ మహాసభకు నా హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియ జేస్తున్నాను.

మన ఆంధ్ర ప్రభుత్వం లాగా అంచెలంచెలుగ అభివృద్ధి కాకుండా - (అలాగయితే యీ శతాబ్దం గడిచినా మనకి విముక్తి దొరకదు. ఓ చిన్న ఉదాహరణ. లక్షల సంఖ్యలో హరిజను లుండే. ఏడాదికి వంద మందికి యిళ్లు కట్టిస్తున్నారు. అదయినా ఊరికి వతల - ఈ లెక్కన అందరికీ యిళ్లు లభించేది ఎన్నేళ్లకు? అందుచేత) అభ్యుదయ రచయితల సంఘం నిజమైన అభ్యుదయాన్ని సత్వరంగా సాధించడానికి సాహిత్య క్షేత్రంలో సమగ్ర కృషి సాగించాలని ఆశిస్తున్నాను.

మద్రాసు
16 - 12 - '78

శ్రీ శ్రీ

కథనూ, స్వతంత్ర కథలు ఒకటిరెండూ ఇవ్వాలని మా ప్రయత్నం. ఆ విషయం చాలామంది మిత్రులకు వ్రాశాం. చెప్పాం. కాని ఎవరో పంపేవరకూ వూరుకోలేము కదా. ఇతర భాషా సాహిత్యాలను చదువుతుంటాను గనక, ఆ పని సర్వసాధారణంగా నేను చేస్తున్నాను. అలాగే దేశీయ సాహిత్యాలలో వస్తున్న మార్పులు, అభివృద్ధులు, పరిణామాలను గురించి ఆసక్తిదాయకమైన వ్యాసాలు దొరుకుతే సంగ్రహరూపంతో ఇస్తున్నాం. ఒక్కొక్కప్పుడు కొన్ని గ్రంథ విమర్శలు – అన్నీ కాదు, కొన్ని మాత్రమే – వ్రాస్తున్నా. అలాగే మిత్రులు ఈశ్వరరావు గారు కూడా సంపాదకీయంగాక, గ్రంథవిమర్శలూ, సాహిత్య సమీక్షా వ్యాసాలూ వ్రాయక తప్పడం లేదు.

"మేమిద్దరమూ ఏదో ఒక్కవిషయం తప్ప రాయకుండా వుండాలంటే మిత్రులందరి సహాయం అవసరం. కొంత మంది సహాయ పడుతున్నారు. కాని చాలదు. అయినా ప్రతి సంచికలోనూ 30కి పైగా రచనలు ప్రచురించ బడుతూన్నా" యని వివరించారు.

తరవాత శ్రీమహీధర గోష్ఠి సమావేశాల పనిపద్ధతి గురించి చెప్పి, ప్రస్తుతం సాగుతున్న విధానంలోని లోపాలు చూపేరు. గోష్ఠులను ఉపయోగకరంగా, విజయవంతంగా సాగించేందుకు సూచనలను ఇవ్వవలసిందని కోరేరు.

శ్రీ జి సి. జీవి ప్రతి నెలా ఒక్కొక్క విషయం వప్పగించి ప్రసంగించడానికి ఒక్కొక్కరిని ఆహ్వానించాలనీ, ఆ ఆహ్వానితుల సిద్ధాంత, భావభేదాలతో నిమిత్తం వుండరాదనీ సూచించారు.

వక్తలు తమ ప్రసంగాల్ని క్లుప్తంగా అయినా వ్రాసుకురావడాన్ని నిబంధించాలనీ, ఆ ప్రసంగం మీద సభలో చర్చలు జరగాలన్న శ్రీ జీవి సూచన తప్పక ఆమోదించాలని శ్రీ మహీధర సూచించేరు.

తరువాత సభ్యులు ఆహ్వానించ వలసిన వారి పేర్లనూ, చర్చనీయాంశాలనూ గురించి వివిధ సూచనలు చేశారు.

కీ. శే. దస్తగీర్

'అభ్యుదయ' పాఠకులకు సుపరిచితుడైన మిత్రుడు దస్తగీర్ యిటీవల కీర్తిశేషుడైనాడని తెలుపడానికి చింతిస్తున్నాము. దస్తగీర్ పీడిత జనశ్రేయస్సుకు త్రికరణ శుద్ధిగా పాటుపడిన మంచి కవి. ఆయన బంధుమిత్రులకు 'అభ్యుదయ' తన సానుభూతి నందజేస్తున్నది.

డేంజర్ ! . . . ఖులుసు వెంకట కామేశ్వర రావు

అకారణంగా –
ఎవడ్నయినా జైల్లోకి తొయ్యి
సమాజాని కిందువల్ల
జరిగే హానేమీ లేదు
రాజకీయ నాయకుడ్ని మాత్రం –
తప్పదను కుంటేనే
జైల్లో పెట్టు
లేదంటే–
అకారణంగా సమాజపు సానుభూతిని
సంపాయించేసుకుంటాడు
అదే జరిగిందా . . . .
ఎవ్విరి థింగ్ ఫినిష్.

శ్రీ వట్టికోట ఆళ్వారుస్వామిగారి 'ప్రజల మనిషి' నవలను పరిచయం చేస్తూ శ్రీ వరవరరావు వ్రాసిన ఈ పుస్తకానికి సాహితీలోకం స్వాగతమిస్తుంది.

నవలా కథాకాలం నాడు ఆ కథారంగమైన తెలంగాణంలో వుండిన సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను వివరిస్తూ అవి కథలోని పాత్రల జీవితాలలో, భావాలలో, అనుబంధాలలో ఏ విధంగా ప్రతిబింబిస్తున్నాయో శ్రీవరవరరావు చక్కని విశ్లేషణ చేశారు. ఆనాటి పరిస్థితులలో కంఠీరవం (ప్రధానపాత్ర) లో క్రమ పరిణామాన్ని, ఏ శక్తితో వచ్చిన ఎదుగుదలతో పాటు మానసికంగా పొందిన చైతన్య పరిణామాన్ని కార్యకరణ సంబంధాల వివరణతో చాల ఉదాత్తంగా విశదీకరించారు. విజయదేవ్‌లో కనిపించే మత సంబంధమైన విరుద్ధ భావాలను ఏలా చిత్రించేరో, చదువు లేకపోయినా కొమరయ్య, బషీర్ వంటి సామాన్య వ్యక్తులు నిత్యజీవిత సంబంధాల ప్రభావంలో మతాతీత స్వభావాన్ని ఎలా అలవరచుకుంటారో కథా గతి క్రమంనుంచి వివరిస్తూ చక్కని విశ్లేషణ కనబరిచేరు. అయితే పరిచయకర్త కనబరచిన కొన్ని అవగాహన లోపాల్ని చెప్పక పోతే సమీక్షకు న్యాయం జరగదు.

“ప్రజల మనిషి”
నవలా పరిచయం
సమీక్ష

రామ్‌భూపాల్ రావు ప్రభుత్వ యంత్రాంగం బలంతో గ్రామంలో పెత్తనం చెలాయిస్తున్నవాడు. ఆయన ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రశ్నించే ఆంధ్ర మహాసభవేపు ఎందుకు ఆకర్షితుడయాడో రచయిత తన నవలలో స్పష్టమైన సూచనలిచ్చారు. పరిశీలనకర్త ఆ క్రమాన్ని గమనించేరు. ఆంధ్ర మహాసభ ప్రముఖుడుగా రామభూపాలరావు రావడం కంఠీరవానికీ, కొమరయ్యాదులకీ ఆ సంబంధం దిగ్భ్రమ కలిగించడం; ఆంధ్రమహాసభతో రామభూపాలరావుకు గల అనుబంధం ఆ సంస్థ కార్యక్రమాలలో భంగం కలిగించ నందుకు తృప్తి పడడాన్ని శ్రీ వరవర రావు జాగ్రత్తగా విశదపరిచారు. తరువాత ఆంధ్ర మహాసభ నాయకత్వంలో వచ్చిన మితవాద అతివాద విభేదాల్ని కూడా గమనిస్తారు. ఒక చోట కాదు, రెండు చోట్ల రామభూపాలరావు పాత్రలోని ఈ వైరుధ్యం గురించి ఒకే విధమైన మాటలలో శ్రీ వరవర రావు వివరించారు.

ఆ పాత్రలోని ఈ వైరుధ్యాన్ని రచయిత ఎందుకు చిత్రించేరు? దానికున్న ప్రాముఖ్యం ఏమిటన్న విషయాన్ని మాత్రం శ్రీ వరవరరావు చర్చించలేదు.

“పెత్తందారీ వర్గాలు . . . ప్రజల వుద్యమాలను తప్పు దోవపట్టించడానికై” ఎల్లా వాటిలో ప్రవేశిస్తాయో ఈ విషయం ద్వారా రచయిత సూచించేరని శ్రీ వరవరరావు వ్రాసింది (82 పుట) సమగ్రం కాదు. అసలు చేరాలనే ఆలోచన ఎందుకు కలుగుతూంది? దాన్ని తప్పు దారి పట్టించడమే వారి వుద్దేశం అన్నది

సరి కాదు. ఆ వుద్యమం వలన వారి ప్రయోజనాలకు ఏ మూలనుంచో రక్షణ, లేక బలం వుంటుందనేది అజ్ఞాతంగా, అంతరంతరాలలో నిగూఢంగా వుండి వుండాలి. జాతీయ కాంగ్రెసు వుద్యమాన్ని జాతీయ బూర్జువా వర్గం ఎందుకు బలపరచింది ? ("ఎడ్రస్ టు ది కమ్యూనిస్ట్ లీగ్" లో కారల్ మార్క్స్ ఈ విషయాన్ని చాలా గొప్పగా సూత్రీకరించారు.) ఏ వుద్యమానికీ శాశ్వత మిత్రులూ, శాశ్వత శత్రువులూ వుండరు దశా పరిణామక్రమంలో అంతవరకూ ఆ వుద్యమంతో వున్నవారు జారి పోతుంటారు. తన ప్రయోజనాల్ని ప్రపంచ ప్రయోజనాలుగా భావించే మనిషి స్వభావం దీనికి మూలం. తన ప్రయోజనం నెరవేరగానే అతని లెక్క ప్రకారం వుద్యమం అవసరం కూడా తీరిపోతుంది. ఈ చివరి ఫలితాన్ని వరవరరావు గారు ప్రపంచ అనుభవంలో గమనించారు. కాని, దానినే కారణంగా కూడా భావిస్తే ఉద్యమానికి గొప్ప ప్రమాదం తెచ్చి పెడతాం. శ్రీ ఆళ్వారు స్వామిగారు రామభూపాలరావు పాత్రను విస్తరించే క్రమంలోనే ఈ వైరుధ్యానికి మూలం చూపేరు. ఆ క్రమాన్ని వరవరరావు వివరించినా దానికీ ఈ వైరుధ్యానికీగల సంబంధాన్ని తీసుకురాలేదు. అలాగే — "ఆధునిక చైతన్య ప్రతిపాదక నవల" అనే అంశం ఉత్తర భాగంలో (పుటలు 29 – 33 లలో) చేసిన పరిశీలన కొంతవరకు తొందర పాటుగా చేసినారనాలి.

"ఈ నవలలో అవగాహనకు సంబంధించిన వైరుధ్యాలు కొన్ని కనిపిస్తాయి. మరి యీ లోపాలు ఎందువల్ల దొర్లాయి ?" అంటూ జరిపిన చర్చనుద్దేశించి ఇది వ్రాస్తున్నాను. పాతికేళ్ల క్రితం చదివిన పుస్తకంలోని వాక్యాల గురించి, ఇటీవలనే పరిశీలనతో చదివిన వారితో ఔనూ, కాదూ అని చర్చించడం అర్థంలేని పని. నవలా కాలం 1938 నాటికి గాక, నవలా రచనా కాలం 1952 నాడు కూడా ఆళ్వారు స్వామి గారి అవగాహనలో కొన్ని వైరుధ్యాలున్నాయంటే మునిగిపోయింది లేదు. వరవరరావుగారి ఈ పరిశీలన మరో పాతికేళ్ళ తరువాత 1977 – 78లో చేసినది కదా. దానితోపాటు రచయిత పాల్గొన్న కమ్యూనిస్టు వుద్యమంలో కూడా అటువంటివే ఏవో లోపాలున్నాయంటే బాధపడక్కర్లేదు. తప్పు జరగని వుద్యమం వుండదు. కమ్యూనిస్టు వుద్యమంలోనూ ఎన్నో తప్పులు జరిగేయి. కాని వుద్యమం తప్పులలో మచ్చుకి శ్రీ వరవరరావు "గాంధీ నెహ్రూలను కమ్యూనిస్టు పార్టీ మహాత్ములుగా, అభ్యుదయవాదులుగా పొగడడం, రాజ్యాంగయంత్ర స్వభావాన్ని పుస్తకాలలో చెప్తున్నా, ఆచరణలో దానిని అర్థం చేసుకోడానికి విఫలమై దానికి బలియై పోతూండడం, మొత్తంగా 1951 తర్వాత ఉద్యమ ఫలితాల నన్నింటినీ కోల్పోవడం" - అంటూ వ్రాశారు.

ఇది ఆయనలో తొందరపాటు తనాన్ని, అవగాహనలోపాన్ని, స్వీయ మానసిక ధోరణిని మాత్రమే చెప్తుంది. గాంధీ, నెహ్రూల వ్యక్తిత్వాన్ని, వారి భావాలకు దేశ ప్రజలపై గల పలుకుబడి బలాన్ని, దేశ చరిత్రలో వారికి గల స్థానాన్ని సకాలంలో, సరిగ్గా అవగాహన చేసుకోక పోవడం కమ్యూనిస్టు పార్టీ చేసిన పొరపాటు అని చెప్పివుంటే సరిగ్గా వుండేది. ఇంక 1951 తరువాత ఉద్యమ ఫలితాల నన్నిటినీ కోల్పోయిందన్నది కూడా చాల అనాలోచిత మయిన

వ్యాఖ్య. పోగొట్టుకొన్న వానికన్న అతి ముఖ్యమైన, అతి విస్తృతమైన, ప్రగాఢమైన విజయం మిగిలింది. తెలంగాణంలో ఒక నవ్య మానవుడు, "నీ బాంచెను, కాల్మొక్త" - అనడమే మరిచిన మానవుడు అక్కడ తల ఎత్తేడు. ఏ రెండు మూడు జిల్లాలలోనో గాక 9 జిల్లాలలో ఈనాడు కనిపించే ఆర్థిక, సామాజిక, సాంస్కృతికాభివృద్ధిని తెచ్చినదీ, త్వరిత పరిచినదీ 1946 – 52ల మధ్య కమ్యూనిస్టు వుద్యమం నడిపిన పోరాటాలు (సదవగాహనతో నడిపినవీ, దురవగాహన ఫలితాలూ కూడా). స్వాధీన పరచుకొన్న భూములు చెయ్యి జారడం కన్న ఇది చాల సుదీర్ఘ ప్రగాఢ ఫలితం.

కాని, ఇందుకు విరుద్ధంగా అశాస్త్రీయమైన ఆలోచన శ్రీ వరవరరావు గారికి ఎందుకొచ్చింది? ఆ విషయం ఆయనే పరిశీలించుకోవడం మేలు.

ఈ పరిచయ గ్రంథం 23 వ పుటలో కంఠీరవం declass కావడం గురించి చెప్పిన మాటలు హాస్యాస్పదంగా వున్నాయి. class అన్నది మన కులం లాంటిది కాదు. ముస్లిం మతస్థుని ఎంగిలి మూకుడులో రొట్టెను హిందూ బ్రాహ్మణుడు తినడాన్ని వర్గరహితుడో, వర్గాంతరుడో కావడంగా వర్ణించడం సదవగాహన కాదు. కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వపు కార్డు వుంటే declass కావడంగా వాదించే వారున్నారు. సెంటు భూమిలేక పోవడం, జేబులో కానీ లేకుండా ఇతరుల మీద బ్రతకటం "ప్రొలిటేరియట్" లక్షణంగా వాదించే వారున్నారు. ప్రజలకు సుఖజీవనం సమకూర్చడం, ఆధునిక విజ్ఞానం సమకూర్చిన సౌలభ్యాలన్నిటినీ అమర్చుకోవడమూ బూర్జువా సమాజం కావడానికి దృష్టాంతంగా చైనా నాయకులతో పాటు మన దేశంలో మార్క్సియులు కూడా బండి తోలడం చూస్తున్నాం. వరవర రావుగారు చెప్పిన ఈ 'డీక్లాస్' కావడం కూడా అదే తరగతిది. ఎంగిలి చిప్పలోని రొట్టె తినడం జైలు పరిస్థితులలో తప్పనిసరిగా అవసరమైన ఒక అనారోగ్యకరమైన పని. అది సాధారణ పరిస్థితులలో ఆచరణీయం కాదు. వరవర రావుగారి ఈ వాక్యం చదువుతూంటే ముప్పయ్యయిదేళ్ల క్రితం చదివిన రొమనోఫ్ వ్రాసిన ఛెర్రీ బ్లాసం కథ గుర్తువచ్చి నవ్వే వచ్చింది. విప్లవానంతర కాలంలో సోవియట్ యువకులలో శుభ్రంగా నీటుగా వుండడం, మంచి దుస్తులు వేసుకోవడం వంటి అలవాట్లు బూర్జువా లక్షణాలుగా, పరిహార్యాలుగా భావిస్తూ వీలయినంత అపరిశుభ్రంగా వుండడం ఫేషన్ చేసుకోవడాన్ని ఆ రచయిత హేళన చేసేడు.

వర్గం ఏదీ అన్నది ఆర్థిక ప్రాతిపదికగలదిగా భావించబడుతున్నా, చిట్టచివరకు నిర్ణయించేది ఆర్థిక ప్రాతిపదికపై ఏర్పడిన సాంస్కృతిక, సామాజిక భావనా సంచయం మాత్రమే. దీనిని మరిచిపోతే చాలా ప్రమాదంలో పడతాం.

ఈ లోపాలున్నా శ్రీ వరవరరావుగారు వ్రాసిన శ్రీ వట్టికోట ఆళ్వారు స్వామిగారి "ప్రజలమనిషి పరిచయం" చక్కని విశ్లేషణ గ్రంథం. ఇటువంటి ప్రయత్నం హర్షణీయం, అభినందనీయమున్నూ. ('అవంతి')

ప్రాప్తి స్థానం: యుగ ప్రచురణలు, హైదరాబాదు, వెల: రూ. 3 – 00

సమీక్ష

'నాలుగు నవలలు'

(రచయితలు: రా వి యన్. అవధాని, విష్టల వెంకట రావు. మంధా వెంకట రమణారావు. ప్రచురణ: T C. W. విజయనగరం. వెల: ఎనిమిది రూపాయలు)

ఈ పుస్తకం పేరు సూచిస్తున్నట్టు, అందులో వున్నవి నవలలు కావు, నవలికలూ కావు.

"మరో పెళ్ళి" (రావి యన్. అవధాని) లో రోజా రాజశేఖరాలు ఓ స్కూల్లో ఎం. ఏ. చదువుకుంటున్న స్నేహితులు. స్కూలు అని రచయిత రాసిందే (పేజీ: 18). రోజాకి ఓ పెద్ద బంగళా, కారు, మంచి డాడీ (రిటైర్డ్ పైలట్ ఆఫీసర్), యింకా మంచి మమ్మీ వున్నారు. రోజా రాజశేఖరం అంటే పడి చస్తుంది. వాళ్ళ పరిచయం, ప్రేమ పెరగడం – అక్షరాలా తెలుగు సినీమా ఫక్కీలో నడుస్తుంది.

రాజశేఖరానికి స్వంత వూళ్ళో ఓ మేడ, ఓ తోట వున్నాయి. పరీక్షలు అయేక సెలవుల్లో రోజాని రాజశేఖరం వూళ్ళో దింపి, ఊటీ వెళ్ళి పోతారు - రోజా తల్లి తండ్రీ. రాజశేఖరానికి తన యింట్లో మేనత్త మేనమామ, మరదలు పద్మ వున్నారు. తల్లీ తండ్రీ లేరు. రోజా రాక అందరికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. పద్మలో ఈర్ష్యను రేపుతుంది. పెళ్ళి ఓ సమస్యగా తయారయింది రాజశేఖరానికి. రాజశేఖరం రోజాల ప్రేమ వ్యవహారం పసిగట్టిన పద్మ, ఆమె తల్లిదండ్రులు వాళ్ళ ఊరు వెళ్ళిపోతారు. (పేజీ 28నుంచి 32 వరకు నాలుగు పేజీలు కనిపించవు కొన్ని పుస్తకాల్లో !) రామం రాజశేఖరం స్నేహితుడు. ఇద్దరూ కలిసి రోజాను పంటచేల గట్లంపట తిప్పి వ్యవసాయం గురించి తెలియజేస్తారు. రామం చెల్లెలు మంజుల – విధవ.

అంతా భైరవి కొండలకు పిక్నిక్ వెడతారు. పిక్నిక్‌లో రాజశేఖరం రోజాను రామానికి అప్పగించి "అలా బౌద్ధ స్థూపాలు చూపించి తీసుకురా" అని కోరతాడు. వాళ్ళలా వెళ్ళేక, రాజశేఖరం ఆలయంలో గంట కొట్టి దేవి పాదాల వద్ద కుంకుమ తెచ్చి మంజుల ముఖాన వుంచి, ఆమె చేయి పట్టుకుని "నిన్ను ప్రేమిస్తున్నా. పెళ్ళి చేసుకుంటా. నువ్వొద్దంటే – ఆజన్మాంతం బ్రహ్మచారిగా వుంటా" అంటాడు. మంజుల అదంతా నమ్మి మధురంగా నవ్వి రాజశేఖరం గుండెల మీద వాలిపోయింది.

ఇదిలా వుండగా – రామం – రోజా బౌద్ధ స్తూపాలనుంచి తిరిగి వస్తూ – రోజా కాలు బెణికి నడవలేనంటుంది. రామం ఆమెను ఎత్తుకుని మోసుకొస్తాడు.

రాజశేఖరం మంజులని, రామం రోజాని పెళ్ళాడతారు. రామం రోజా ఫారిన్ చదువు కోసం వెడతారు. రాజశేఖరం మంజుల హనీమూన్‌కి వెళ్ళి వస్తూ, కలకత్తాలో ఆగుతారు. కలకత్తాలో మంజులని పారేసుకుంటాడు, రాజశేఖరం.

ఆ బాధలో గ్రామంలో వుండలేక చంద్రయ్య. వీరయ్యలకు (వాళ్లు రాజశేఖరం తోట పని చూసే మనుషులు) వద్దని వారిస్తున్నా – చెరో అయిదెకరాలు రాసి యిస్తాడు, రాజశేఖరం. వీరయ్య కూతురు పెళ్లికోసం మూడు

వేలు దానం యిచ్చేస్తాడు. ఆ తర్వాత హైదరాబాదు వచ్చేసి ఓ శరణాలయం స్థాపించాడు. రామం, రోజా, రోజా తల్లి ఫారిన్ నుంచి వెతుక్కుంటూ శరణాలయానికి వస్తారు. అందులోనే పరుపులు – మంచాలు వేసుకుని కాపురం వుంటారు వీరంతా. కలకత్తాలో తప్పిపోయిన మంజుల నానా బాధలు పడి యీ శరణాలయం వెతుక్కుంటూ వచ్చేస్తుంది. శేష జీవితం పురుషులతో స్త్రీల సమానత్వం కోసం పాటుపడాలని నిశ్చయించుకుంటుంది. 62 పేజీల్లో ముగిసిన యీ కథ సాంఘిక, జానపద సినిమా కథలా వుంది.

"ఆశా పెళ్లి" కూడా పై రచయిత రాసినదే. అవకతవకలకి కాని, అపరిపక్వ కథనానికి గాని పైనవలికకు తీసిపోదు కనుక వివరణ పెద్దగా అవసరం లేదు.

"పీటల కింద పెళ్ళి" నిష్టల వెంకటరావు రాసిన, అంతా విజయనగరానికే పరిమితం అయిన ఓ తండ్రీ కొడుకుల కథ. ఆరంభంలో తండ్రీ కొడుకుల సంభాషణలు ఎబ్బెట్టుగా వున్నాయి. వాటిని తొలగించి చూస్తే – కథ ఫార్సే అయినా, ఓ సారి చదవచ్చు.

తాలూకాఫీసు ముచ్చట్లు – "విజేనారం" – "వొయిజాగు" బస్సు యాత్ర – భీం ట్రిమీస్ – మహాంకాళి మతం అహంకారాలు – వెదురు బియ్యం పరమాన్నం ఘుమఘుమలూ – భీమారావు కాటా కుస్తీ విస్తృతీ–బాగున్నాయి. 'V' – శేషాలు, వంటి/వికృత పద ప్రయోగా లున్నాయి. కథనంలో శక్తి వున్న యీ రచయిత ఓ బలమైన కథని వ్రాస్తే బాగుండునని పిస్తుంది.

:) "తిరోగమనం"లో మంధా వెంకట రమణారావు 28 పేజీల విషయాన్ని ఆరు భాగాలు చేసేరు. ఆఫీసుల్లో – రేషను షాపుల్లో – రైల్వే స్టేషన్సులో విద్యుత్ శాఖలో – ఉన్న లోపాల పైన చక్కని ఉపన్యాసాలు చెక్కేరు. సినిసిజాన్ని వినిపించేరు. చివర కర్షకుడి మీద సానుభూతితో ముగించారు. (పునర్వసు)

తిరుగుబాటు

టి. గౌరీశంకర్

రాయీ రాయీ రాపిడి పడితే
నిప్పు రగలకేమవుతుంది!
చేయీ చేయీ కలగలిపితే
చేయలేని దంటు ఏముంటుంది!
పిడికిలి పిడికిలి కలిస్తే
దోపిడీలు అరికట్ట బడకేం
చేస్తాయి!
నడుం నడుం బిగిస్తే
ఇడుములు పారిపోకే మవుతాయి!
గొంతు గొంతు కలిపితే
దిగంతాల దాకా మ్రోగదా
పిల్లిని గదిలో బంధిస్తే
పులి కాకే మవుతుంది!
సామాన్యుణ్ణి ఉపేక్షిస్తే
వాడి సహనాన్ని పరీక్షిస్తే
సమాజంలో తిరుగుబాటు రాదా!
ఆ తిరుగుబాటు వెనుక
వెలుగు బాట లేదా!!

ఆంధ్ర ప్రదేశ్ అభ్యుదయ
రచయితల సంఘం 8 వ
మహాసభకు శుభాకాంక్షలు

అభివృద్ధికి మారు పేరు ఆంధ్రప్రదేశ్

వింధ్యకు దక్షిణాన, ప్రకృతిమాత ఒడిలో ప్రగతి వీణగా వెలుగొందే మన తెనుగునాడులో ప్రతిభావంతులైన కవులు, పరాక్రమ శాలురు, శాస్త్రవేత్తలు, సాంకేతిక విజ్ఞాన వేత్తలు, ఎంతో మంది కృషిచేసి దశాబ్దాల తరబడి నిత్యనూతనంగా వర్ధిల్లే మనదేశ ప్రగతికి బాసటగా నిలిచారు. కీర్తి బావుటాల నెగురవేశారు.

దేశం నడిబొడ్డున నిలిచిన మన రాష్ట్రానికి అపారమైన వనరులతో ప్రకృతి ఎనలేని వరాలు ప్రసాదించింది. కొత్త పాతల మేలికలయికగా, సమగ్రమయిన సమ్మిళిత సంస్కృతికి పుట్టినిల్లుగా పరిశ్రమల అభివృద్ధికి పట్టుగొమ్మగా నిలిచే భాగ్యనగరం రాజధానిగా వెలుగొందే ఆంధ్రప్రదేశ్ నేడు అందరి దృష్టి ఆకర్షిస్తూంది.

'దక్షిణాది ధాన్యాగారం'గా పేరుపొందిన మన రాష్ట్రంలో ప్రగతిశీలురైన మన రైతాంగం 1977-78 లో 86.60 లక్షల టన్నుల ఆహార ధాన్యాలను పండించారు. ఈ సంవత్సరం 98 లక్షల టన్నుల వరకూ ఉత్పత్తిని పెంచేందుకు రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించబడ్డాయి. జాతీయ నిల్వలకు మన రాష్ట్రం 10 లక్షల టన్నులకు పైగా ధాన్యం అందించింది.

జాతిని కొరతలకు దూరంగా వుంచేందుకు మన రైతులు అహరహం కృషిచేస్తున్నారు. అందుకే అభివృద్ధికి మారు పేరు ఆంధ్రప్రదేశ్.

ఆ. ౙ. స. పౌ. సం.
27/78-79.